ఇక రా.. వానా..!

పొలాలన్నీ సాగుకు సిద్ధం

5న పునర్వసు కార్తె ఆరంభం

విత్తుకు అనుకూల సమయం

ఐదు రోజులపాటు జిల్లాలో వానలు

ఖరీఫ్ విత్తన సాగుకు మృగశిర కార్తె తరువాత పునర్వసు అనుకూలమని రైతులు విశ్వసిస్తారు. ఈ కార్తెలో విత్తనం వేస్తే మంచి దిగుబడి వస్తుందని అంటారు. ఈనెల 21తో మృగశిర కార్తె ముగిసింది. అలోగా పదును వర్షాలు కొన్ని ప్రాంతాల్లోనే పడ్డాయి. దీంతో 5,800 హెక్టార్లలో పంట సాగైంది. పునర్వసు కార్తె వచ్చే నెల 5న మొదలౌతుంది. నైరుతి రుతు పవనాల ప్రభావంతో ఈనెల ఆరంభంలో విస్తారంగా వర్షాలు కురిశాయి. దీంతో దుక్కిదున్ని.. పొలాలను సిద్ధం చేసుకున్నారు. వేరుశనగ, కంది తదితర విత్తనాలను సైతం తగినన్ని సమకూర్చుకున్నారు. ఒక్క తడి అయితేచాలు.. జిల్లాలో పంటల సాగు పూర్తిస్థాయిలో మొదలౌతుంది. ఆ ఒక్కవాన ఈ ఐదు రోజుల్లో కురిసే అవకాశం ఉంది. వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ప్రభావంతో రాయలసీమలో మూడు రోజులపాటు మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించింది. ఉమ్మడి జిల్లాలో ఐదు రోజులపాటు వర్షాలు కురుస్తాయని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ పరిశోధన కేంద్రం శుక్రవారం పేర్కొంది. నైరుతి రుతుపవనాలు పూర్తిస్థాయిలో విస్తరించాయి. ఈ ఏడాది సాధారణం కంటే ఎక్కువ వర్షాలు కురుస్తాయని శాస్త్రవేత్తలు అంటున్నారు. రైతులకు ఇవన్నీ శుభవార్తలే..!



ఆత్మకూరు వద్ద వేరుశనగ విత్తనం వేస్తున్న రైతులు



యాడికిలో విత్తుకు సిద్ధమైన పొలం

అనంతపురం అర్బన్, జూన్ 28: ఖరీఫ్ సీజన్ ప్రారంభం కాగానే జిల్లాలోని పలు మండలాల్లో విస్తారంగా వర్షాలు కురిశాయి. దీంతో రైతులు దుక్కి దున్నుకున్నారు. పంటల సాగుకు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. ఆ తరువాత కూడా వర్షాలు కొనసాగడంతో కొందరు వివిధ రకాల పంటలను సాగు చేశారు. మిగిలిన ప్రాంతాల రైతులు పదును వర్షం కోసం ఎదురు చూస్తున్నారు. గత ఏడాదితో పోలిస్తే నైరుతి రుతు పవనాలు ఈ ఏడాది ముందుగానే, ఈ నెల 2న జిల్లాలో ప్రవేశించాయి. గత ఏడాది వర్షాభావం కారణంగా పంటల సాగు ఆశాజనకంగా సాగలేదు. జిల్లా వ్యాప్తంగా మరోమారు కరువు పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ ఏడాది ఆ సమస్య ఉండదని భావిస్తున్నారు.

పునర్వసు కోసం..

మృగశిర కార్తెలో గత ఏడాదితో పోలిస్తే ఈ సారి విత్తనం తక్కువ విస్తీర్ణంలోనే పడింది. ఈ నెల 7న మృగశిర కార్తె ఆరంభమై.. 21వ తేదీలో ముగిసింది. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి దాకా 5,800 హెక్టార్లల్లో మాత్రమే వివిధ రకాల పంటలు సాగయ్యాయి. ఇందులో ప్రధాన పంట వేరుశనగ మూడు వేల హెక్టార్లల్లో సాగైంది. గత ఏడాది ఇదే సమయానికి జిల్లా వ్యాప్తంగా 13వేల హెక్టార్లల్లో వివిధ రకాల పంటలు సాగయ్యాయి. ఇందులో 5 వేల హెక్టార్లకుపైగా వేరుశనగ ఉన్నింది. ఈ నెల 22 నుంచి ఆరుద్ర కార్తె ఆరంభమైంది. కానీ ఈ కార్తెలో విత్తనం వేస్తే దిగుబడి సరిగా రాదన్న అభిప్రాయం రైతుల్లో ఉంది. అందుకే పునర్వసు కార్తె కోసం వేచి చూస్తున్నారు. పునర్వసులో వర్షం కురవగానే విత్తనం వేసేందుకు సిద్ధంగా ఉన్నారు. ఎక్కువ శాతం రైతులు వేరుశనగ, కంది, పత్తి సాగుకు మొగ్గు చూపుతున్నారు. వాటి విత్తనాలను సిద్ధం చేసుకున్నారు. జూలై 5న పునర్వసు కార్తె ఆరంభం కానుంది. ఈ ఏడాది పునర్వసులోనే ఎక్కువ శాతం పంటలు సాగయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

బాగానే కురిసింది.. కానీ..

జూన్ నెలలో జిల్లాలో సాధారణ వర్షపాతం 61.0 మి.మీ. కాగా, ఇప్పటి దాకా 145.5 మి.మీ. వర్షపాతం నమోదైంది. గత ఏడాది ఈ సమయానికి 45.8 మి.మీ. వర్షపాతం మాత్రమే నమోదైంది. గత ఏడాదితో పోలిస్తే మూడు రెట్లకంటే ఎక్కువ వాన కురిసింది. సాధారణ వర్షపాతం సైతం రెట్టింపునకు మించి కురిసింది. కానీ, విత్తనం వేసేందుకు అనువైన సమయంలో మాత్రం పెద్దగా కురవలేదు. ఈ కారణంగానే రైతులు పునర్వసు దాకా వేచి చూడాల్సి వస్తోంది. ఆకాశంలో మేఘాలకు కొదువ లేకపోయినా.. చినుకు రాల్చకుండా దోబూచులాడుతున్నాయి. ఈ ఐదు రోజులు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించినందున.. రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు.

పదునైతే చాలు..



ఈ నెలలో కురిసిన వర్షాలకు పొలంలో సేద్యపు పనులు పూర్తి చేశాము. ఇక పదును వాన కోసం ఎదురుచూస్తున్నాం. వర్షం కురవగానే వేరుశనగ విత్తనం వేస్తాను. ఇప్పటికే విత్తన కాయలు కొనుగోలు చేసి సిద్ధం చేసుకున్నాను. కొన్ని రోజులుగా మేఘాలు ఊరిస్తున్నాయి. కానీ చినుకు రాలడం లేదు.

\- పాండు, యాడికి


పత్తి సాగు చేశా..



వర్షం కురుస్తుందన్న నమ్మకంతో 12 ఎకరాల్లో ఐదు రోజుల క్రితం పత్తి పంట సాగు చేశాను. మేఘాలు ఊరిస్తున్నాయి తప్ప వర్షం కురవడం లేదు. ఆకాశం వైపు ఆశగా చూస్తున్నాం. కొన్ని రోజులుగా గాలులు ఎక్కువగా వీస్తున్నాయి. ఒక్క వాన పడితే పంట మొలకెత్తుతుంది.

\- ఆదిరెడ్డి, వీరారెడ్డిపల్లి, యాడికి మండలం

వేరుశనగ పంట వేశా..



మృగశిర కార్తెలో ఐదెకరాల్లో వేరుశనగ పంట సాగు చేశాను. గత నెలలో పడిన వర్షాలకు సేద్యం పనులు పూర్తి చేసుకున్నారు. అందుకే మృగశిర కార్తెలో వర్షం పడగానే విత్తనం వేశాను. మరో ఐదు ఎకరాల్లో కంది పంట సాగు చేయాలనుకుంటున్నాను. పదును వర్షం పడితే కంది విత్తనం వేస్తాను.

\- వెంకటేష్, ఆత్మకూరు

మంచి వానలున్నాయి..



ఈ సారి ఆశించిన స్థాయిలో వర్షాలు కురిసే అవకాశం ఉంది. ప్రస్తుతం తేలికపాటి వర్షాలు పడే అవకాశం ఉంది. వచ్చే నెలలో సాధారణం కంటే ఎక్కువగా వర్షపాతం నమోదయ్యే అవకాశాలు ఉన్నాయి.

\- నారాయణస్వామి, సీనియర్ శాస్త్రవేత్త, వాతావరణ విభాగం, రేకులకుంట

టీ స్టాల్‌కు ఫైల్స్‌పై విచారణ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అనంతపురం విద్య, జూన్ 28: సమగ్రశిక్ష ప్రాజెక్టు నుంచి ఫైళ్లు బయటకు వెళ్లిన ఘటనపై అధికారులు చర్యలకు సిద్ధమయ్యారు. ఇప్పటికే విచారణ పూర్తి చేశారని తెలిసింది. ప్రాజెక్టులో పనిచేసి, బదిలీపై వెళ్లిన సూపరింటెండెంట్ సునీల్‌తోపాటు మరో ఇద్దరు ఉద్యోగులు ఫైళ్లతో టీస్టాల్‌లో ప్రత్యక్షమయ్యారు. దీనిపై ఈనెల 26న 'టీస్టాల్‌కు ఆఫీస్ ఫైళ్లు' శీర్షికన ప్రచురితమైన కథనం విద్యాశాఖ, సమగ్రశిక్ష ప్రాజెక్టు ఉద్యోగుల్లో చర్చనీయాంశమైంది. ఈ విషయం సమగ్రశిక్ష ఏపీసీ వైఖోమ్ నిదియా దేవి దృష్టికి వెళ్లింది. దీంతో విచారణ చేయాలని ఏపీసీ ప్రాజెక్టు అధికారులను ఆదేశించారు. విచారణకు సంబంధించిన ఫైలును సమగ్రశిక్ష ప్రాజెక్టు అధికారులు ఇప్పటికే సిద్ధం చేసినట్లు విశ్వసనీయంగా తెలిసింది. త్వరలో ఆ ఫైల్ ఏపీసీ వద్దకు వెళ్లే అవకాశం ఉంది. ఫైళ్లను బయటకు తీసుకెళ్లినవారిపై ఎలాంటి చర్యలు ఉంటాయోనన్న చర్చ జరుగుతోంది.

మత్తు పదార్థాలను అరికట్టండి

నిఘా వేయండి.. తనిఖీలను పెంచండి: కలెక్టర్



మత్తు పదార్థాల అనర్థాలు తెలిపే పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, అధికారులు

అనంతపురం టౌన్, జూన్ 28: జిల్లాలో మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలు లేకుండా గట్టి చర్యలు చేపట్టాలని కలెక్టర్ వినోద్ కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి కమిటీతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో డ్రగ్స్ రవాణా, గంజాయి సాగు, రవాణా కాకుండా చూడాలని అన్నారు. మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలు వినియోగించకుండా విద్యాలయాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, వాటివల్ల కలిగే అనర్థాలను తెలియజేయాలని సూచించారు. జిల్లా మీదుగా వెళుతున్న కర్నాటక బస్సులను, ఇతర వాహనాలను తనిఖీ చేయాలని, సరిహద్దు ప్రాంతాలలో గట్టి నిఘా వేయాలని ఆదేశించారు.

రోడ్డు ప్రమాదాలను నివారించండి

జిల్లాలో రోడ్డు ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ప్రమాదాలు, రోడ్డు భద్రతపై కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని 39 ప్రాంతాలలో ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయని, వాటిని బ్లాక్ స్పాట్‌లుగా గుర్తించామని అన్నారు. అక్కడ ప్రమాదాలు జరగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జాతీయ రహదారుల నిర్వహణ కొన్నిచోట్ల సరిగా లేదని, ఆయా ప్రాంతాలలో ప్లాంటేషన్, లైటింగ్‌కు చర్యలు చేపట్టాలని సూచించారు. రోడ్డు భద్రతపై స్లోగన్స్ ప్రదర్శించాలని, కలెక్టరేట్ వద్ద డిజిటల్ స్క్రీన్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జిల్లా కేంద్రంలో 40 సీసీ కెమెరాలు ఉన్నాయని, వాటిని ఇన్‌స్టలేషన్ చేసి జిల్లా పోలీస్ కంట్రోల్‌రూమ్‌కు కనెక్షన్ ఇవ్వాలని సూచించారు. తపోవనం, ఆంధ్రజ్యోతి కార్యాలయం, కళ్యాణదుర్గం రోడ్డు ప్రాంతాలలో లైట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలు జాతీయ రహదారులలో ఎక్కువగా జరుగుతున్నాయని, డ్రంక్ అండ్ డ్రైవ్ గుర్తింపు పరికరాలను మరమ్మతు చేయించాలని, విస్తృతంగా పరీక్షలు చేయాలని ఆదేశించారు. నగరంలోని పోలీస్ పెట్రోల్ బంకు, ఓల్డ్ టౌన్ కూరగాయల మార్కెట్, పీటీసీ తదితర ప్రాంతాలలో వారంలోపు ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. సమావేశాలలో డీటీసీ వీర్రాజు, డీఎస్పీ ఆంథోనప్ప, ట్రాఫిక్ సీఐ నారాయణరెడ్డి, ఆర్టీసీ ఆర్ఎం సమంత్, డీఎంహెచ్ఓ ఈబీ దేవి, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య.. భోజనం అందాలి

శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి



విద్యార్థులతో కలిసి ఎమ్మెల్యే మధ్యాహ్న భోజనం..

బుక్కరాయసముద్రం, జూన్ 28: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన విద్య, ఆహారం అందేలా చూడాలని శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి సూచించారు. బుక్కరాయసముద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు, మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీ నిర్వాహకులకు పలు సూచనలు ఇచ్చారు. భోజనం నాణ్యత విషయంలో రాజీ పడేది లేదని అన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయని, పాఠశాల పరిసరాలను శుభ్రంగా ఉంచాలని సూచించారు. పాఠశాలలో ఆగిపోయిన మధ్యాహ్న భోజనం పథకం భవన నిర్మాణాన్ని పరిశీలించారు. కలెక్టర్‌తో మాట్లాడి నిధులు మంజూరు చేయిస్తామని అన్నారు. ఉపాధ్యాయుల కొరత ఉందని తెలుసుకుని, మెగా డీఎస్సీ ద్వారా త్వరలోనే ఆ సమస్య పరిష్కారమౌతుందని అన్నారు. ఇతర సమస్యలను డీఈఓతో మాట్లాడి పరిష్కరిస్తామని తెలిపారు. కార్పొరేట్ పాఠశాలకు దీటుగా ఈ ఏడాది ఫలితాలు సాధించాలని సూచించారు. విద్యార్థులతో కలిసి పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేశారు. ఎంఈఓ లింగానాయక్, హెచ్ఎం వసుంధర, టీడీపీ జిల్లా ఉపాధ్యాక్షుడు పసుపుల హనుమంతరెడ్డి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఒకటో తేదీన ఇంటివద్దకే పింఛన్

లబ్ధిదారుల మ్యాపింగ్ పూర్తి

డీఆర్‌డీఏ-వైకేపీ పీడీ ఈశ్వరయ్య



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ ఈశ్వరయ్య

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 28: జిల్లావ్యాప్తంగా 12 వేల క్లస్టర్లలో పింఛన్ పంపిణీ మ్యాపింగ్ పూర్తి చేశామని, ఒకటో తేదీన ఇంటి వద్దనే లబ్ధిదారులకు సొమ్ము అందజేసేలా చర్యలు తీసుకుంటున్నామని డీఆర్‌డీఏ-వైకేపీ పీడీ ఈశ్వరయ్య తెలిపారు. తన చాంబర్‌లో ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. సీఎం చంద్రబాబు పింఛన్ పెంచారని, పెంచిన పింఛన్‌తో పాటు మూడు నెలల (ఏప్రిల్, మే, జూన్) బాకియి మొత్తాన్ని ఒకటో తేదీన ఇంటివద్దనే అందజేస్తామని తెలిపారు. జూలై నెలకు 2,89,508 మంది లబ్ధిదారులకు రూ.197.44 కోట్లు మొత్తాన్ని జిల్లాకు విడుదల చేశారని అన్నారు. ఇందులో మూడు నెలల పెంచిన మొత్తం రూ.70.62 కోట్లు, జూలై నెలకు సంబంధించి రూ.126.81 కోట్లు ఉన్నాయని తెలిపారు. పదకొండరు కేటగిరీలకు సంబంధించి 2,35,514 మందికి పింఛను రూ.3 వేల నుంచి రూ.4 వేలకు, రెండు కేటగిరీల్లోని 46,742 మందికి రూ.3 వేల నుంచి రూ.6 వేలకు, ఇంకో రెండు కేటగిరిల్లోని 2,535 మందికి రూ.5 వేల నుంచి రూ.15 వేలకు, ఐదు కేటగిరీల్లోని 859 మందికి రూ.5 వేల నుంచి రూ.10 వేలకు పెంచారని ఆయన వివరించారు. ఇప్పటికే చేసిన మ్యాపింగ్ ప్రకారం గ్రామ-వార్డు సచివాలయాల ఉద్యోగుల ద్వారా ఇంటి వద్దకే పింఛన్ అందజేస్తామని, ఏ ఒక్క లబ్ధిదారుడు సచివాలయాలు, బ్యాంకులు, ఇతర కార్యాలయాల వద్దకు వెళ్లాల్సిన అవసరం లేదని అన్నారు. ప్రతి 50 మంది పింఛన్‌దారులకు ఒక ఉద్యోగి పింఛన్ అందజేసేలా ప్రణాళికలు సిద్ధం చేశామని తెలిపారు. ఇప్పటికే మండల సమాఖ్యల సమావేశాలు నిర్వహించి, పింఛన్ పంపిణీపై అవగాహన కల్పించామని అన్నారు.

భారీగా పడిపోయిన చీనీ ధరలు

● ఒక్కరోజులోనే టన్నుపై రూ.10వేలకుపైగా..

అనంతపురం రూరల్, జూన్ 28: మార్కెట్‌లో చీనీ ధరలు భారీగా పడిపోయాయి. ఒక్కరోజులోనే టన్నుపై రూ.10వేలు తగ్గింది. శుక్రవారం అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లోని చీనీ మార్కెట్‌లో గరిష్ఠంగా టన్ను రూ.18వేలతో అమ్ముడుపోయాయి. అదే గురువారం టన్ను రూ.27వేలు పలికాయి. సరాసరి ధరల్లో కాస్త వ్యత్యాసం ఉండింది. సరాసరి ధర రూ.12వేలు, కనిష్ఠ ధర రూ.8వేలతో అమ్ముడుపోయాయి. చీనీ ఉత్పత్తుల ఎగుమతి ప్రాంతాల్లో వర్షాలు అధికంగా కురవడమే ధరల తగ్గుదలకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. ఉమ్మడి జిల్లా నుంచి ఢిల్లీ, బెనారస్, కోల్‌కత్తా, జైపూర్ ప్రాంతాలకు ఎగుమతి జరుగుతుంది. ఆయా ప్రాంతాల్లో అధిక వర్షాల కారణంగా ధరలు పడిపోయాయని వ్యాపారులు అభిప్రాయపడుతున్నారు. గురువారం ఉమ్మడి జిల్లా నుంచి వెళ్లిన చీనీ కాయలు వర్షాల కారణంగా నిలిచిపోయినట్లు వ్యాపారులు పేర్కొంటున్నారు.

2, 3 తేదీల్లో గురుకుల ప్రవేశాలకు కౌన్సెలింగ్

అనంతపురం ప్రెస్‌క్లబ్, జూన్ 28: మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకుల పాఠశాలల్లో 6, 7, 8, 9 తరగతులకు ప్రవేశ పరీక్ష రాసిన విద్యార్థులకు జూలై 2,3 తేదీల్లో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు గురుకుల పాఠశాలల జిల్లా కన్వీనర్ సంగీతకుమారి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 6,7,8,9 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లకు ఈనెల 20, 21 తేదీల్లో ప్రవేశ పరీక్షలు నిర్వహించామన్నారు. 63 సీట్లకు మొత్తం 1301 మంది దరఖాస్తు చేసుకోగా... 957 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారన్నారు. పరీక్షల ఫలితాలు, మెరిట్ జాబితాను అన్ని గురుకుల పాఠశాలల్లోని నోటీసు బోర్డులో ఉంచామన్నారు. ఫలితాల కోసం mjpapbcwreis.apcfss.in వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు. జూలై 2న బాలురకు, 3న బాలికలకు కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే కౌన్సెలింగ్‌లో మెరిట్ ఆధారంగా సీట్లను భర్తీ చేస్తామన్నారు.

పది సప్లిమెంటరీలో 32 మంది పాస్

అనంతపురం ప్రెస్‌క్లబ్, జూన్28: జిల్లాలోని ఎస్సీ సంక్షేమ వసతిగృహాల్లో వసతి పొందుతున్న 10వ తరగతి విద్యార్థులు సప్లిమెంటరీ పరీక్షల్లో 32 మంది పాస్ అయినట్లు ఆ శాఖ జేడీ మధుసూదన్‌రావ్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన స్పష్టం చేశారు. మొత్తం 38 మంది విద్యార్థులు పరీక్ష రాయగా... 32 మంది పాసవ్వగా... ఆరుగురు ఫెయిల్ అయినట్లు తెలిపారు.

రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్‌కు 1వరకు గడువు

అనంతపురం విద్య, జూన్ 28 : పదో తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలకు సంబంధించి రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్‌కు సంబంధించి జూలై 1వ తేదీ ఆఖరి గడువని డీఈఓ వరలక్ష్మి శుక్రవారం ప్రకటించారు. రీ కౌంటింగ్‌కు రూ.500, రీ వెరిఫికేషన్‌కు రూ.1000 చెల్లించాలన్నారు. ప్రధానోపాధ్యాయుల లాగిన్ ద్వారా దరఖాస్తు చేయడంతోపాటు, ఫీజు చెల్లించాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో రీకౌంటింగ్, రీవెరిఫికేషన్ కోసం సీఎఫ్‌ఎంఎస్, సిటిజన్ చార్టర్ ద్వారా ఫీజు చెల్లింపు చేయవద్దని, అలాంటివి ఆమోదించరని ప్రతి విద్యార్థి గమనించాలని సూచించారు.

లైంగిక వేధింపులపై ఫిర్యాదుల కోసం కమిటీలు

అనంతపురం విద్య, జూన్ 28 : పనిచేసే చోట లైంగిక వేధింపులు ఎదుర్కొనే బాధితుల కోసం.. అంతర్గత ఫిర్యాదుల కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. లైంగిక వేధింపుల నివారణ, నిషేధం, దిద్దుబాటు చట్టం-2013 అమలులో భాగంగా అన్ని మండలాల తహసీల్దార్లను నోడల్ ఆఫీసర్లుగా జిల్లా కలెక్టర్ నియమించారన్నారు. 10 మంది కంటే ఎక్కువ రెగ్యులర్, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్, ఇతర వర్గాల ఉద్యోగులు పనిచేసే అన్ని ప్రభుత్వ, ప్రభుత్వేతర కార్యాలయాల్లో, కర్మాగారాల్లో, స్వయం ఉపాధి ప్రదేశాల్లో అంతర్గత ఫిర్యాదుల కమిటీలను ఏర్పాటు చేయాలని ఆమె సూచించారు. లైంగికంగా వేధింపులు ఎదుర్కొన్న మహిళలు నోడల్ ఆఫీసర్లుగా నియమితులైన తహసీల్దార్ల వద్ద ఫిర్యాదు చేయవచ్చునని తెలిపారు. తహసీల్దార్లు సంబంధిత ఫిర్యాదులను స్థానిక లేదా అంతర్గత ఫిర్యాదుల కమిటీ ద్వారా చర్యలు తీసుకునే ఆదేశాలిస్తారని తెలిపారు.

నేడు జాతీయ లోక్ అదాలత్

అనంతపురం క్రైం,జూన్ 28: ఉమ్మడి జిల్లాల పరిధిలో శనివారం జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నట్లు మొదటి అదనపు జిల్లా న్యాయాధికారి, ఇన్‌చార్జ్ జిల్లా న్యాయాధికారి సత్యవాణి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి శివప్రసాద్‌యాదవ్ తెలిపారు. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల పరిధిలోని అన్ని కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న మోటార్ వాహనాల ప్రమాద భరిత కేసులు, సివిల్ కేసులు, చెక్‌బౌన్స్ కేసులు, కుటుంబ తగాదాలు (విడాకుల కేసులు కాకుండా), పారిశ్రామిక హోదాలు, రాజీ చేయదగ్గ క్రిమినల్ కేసులు, వినియోగదారుల ఫోరం కేసులు, పంచాయతీ, మున్సిపల్ టాక్స్ కేసులు, ప్రిలిటిగేషన్ కేసులను జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ చేస్తారని తెలిపారు. సంబంధిత కక్షిదారులందరూ జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకొని లబ్ధి పొందాలని సూచించారు.

వసతిగృహాల మరమ్మతులకు నిధుల విడుదల

ఎస్సీ సంక్షేమశాఖ జేడీ మధుసూదన్‌రావు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అనంతపురం ప్రెస్‌క్లబ్, జూన్28: జిల్లాలో ఎస్సీ సంక్షేమ వసతిగృహాలు, ఒక గురుకుల పాఠశాల మరమ్మతుల కోసం రూ. 1.35 కోట్లు నిధులు విడుదల చేసినట్లు జేడీ మధుసూదన్‌రావు శుక్రవారం ప్రకటించారు. ఈనెల 19న 'సంక్షేమం తిరిగొచ్చేనా'..? అని ఆంధ్రజ్యోతిలో ప్రచురించిన కథనంపై జేడీ స్పందించారు. జిల్లా కలెక్టర్, జేసీ, జడ్పీ సీఈఓలు ఎంపీడీఓలు, తహసీల్దార్లతో తనిఖీలు చేయించిన అనంతరం జిల్లాలో అత్యంత శిథిలావస్థకు చేరుకున్న 10 సంక్షేమ వసతిగృహాలు, ఒక అంబేడ్కర్ గురుకులాన్ని మరమ్మతులకు ఎంపిక చేసినట్లు జేడీ తెలిపారు. ఇందుకోసం 10 హాస్టళ్ల మరమ్మతులకు రూ. 1.12 కోట్లు, కురుగుంట అంబేడ్కర్ గురుకులానికి రూ. 23 లక్షల చొప్పున మొత్తం రూ. 1.35 కోట్లు విడుదల చేశారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని ఏపీ విద్యాసంక్షేమ మౌలిక సదుపాయాల అభివృద్ధి కార్పొరేషన్ ఏఈను ఆదేశించినట్లు జేడీ తెలిపారు.

ఉద్యోగాలకు ఊతం

అనంతపురం సెంట్రల్, జూన్ 28: నూతన ప్రభుత్వం ఏర్పాటైన కొద్దిరోజుల్లోనే ఉద్యోగ కల్పన ప్రక్రియ వేగం పుంజుకుంది. జిల్లా ఉపాధి కల్పన, ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో రెండు వారాల్లోనే వరుస ఇంటర్వ్యూలు నిర్వహించారు. శుక్రవారం ఐటీఐ కళాశాలలో నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలకు దాదాపు 600మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో ఏకంగా 160మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రామమూర్తి తెలిపారు. అదేవిధంగా 13న నిర్వహించిన ఇంటర్వ్యూల్లో 95మంది విద్యార్థులు ఎంపిక అయ్యారన్నారు. వీటితోపాటు ఉపాధి కల్పన కార్యాలయంలో తాజాగా నిర్వహించి ఇంటర్వ్యూల్లో దాదాపు 250మందికి ఉద్యోగాలు కల్పించామని ఉపాధికల్పనాధికారి కళ్యాణి పేర్కొన్నారు.

ఐదేళ్లలో ఏం చేశారో.. లెక్కలు తీయండి..

● తోపుదుర్తి డెయిరీపై వివరాలు ఇవ్వండి ● ఉమ్మడి జిల్లా పీడీలకు ఎమ్మెల్యే పరిటాల సునీత ఆదేశం



డీఆర్‌డీఏ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

అనంతపురం అర్బన్, జూన్ 28: ఐదేళ్లలో రాప్తాడు నియోజకవర్గంలో అమలైన పథకాలు, రుణాలు తదితర వివరాలన్నీ వెలికి తీయాలని మాజీ మంత్రి, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అధికారులను ఆదేశించారు. శుక్రవారం అనంతపురంలోని తన క్యాంపు కార్యాలయంలో అనంతపురం, సత్యసాయి జిల్లా డీఆర్‌డీఏ పీడీలు, ఏపీఎంలతో ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పరిటాల సునీత మాట్లాడుతూ... ప్రభుత్వం నిర్దేశించిన మేరకు జూలై 1వతేదీన ఇంటి వద్దనే పింఛన్‌దారులకు పింఛన్ల సొమ్మును పంపిణీ చేసేలా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మహిళా సంఘాల రుణాల మంజూరులో జరిగిన అవకతవకలపై విచారించి చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు దారి మళ్లించిన వివరాలు అందజేయాలన్నారు. నిరుద్యోగులకు ఉపాధి కల్పన కోసం ఏవిధంగా ముందుకు వెళ్లాలన్న అంశంపై నివేదిక సిద్ధం చేయాలన్నారు. అందరికీ ఉపాధి కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. తోపుదుర్తి సహకార డెయిరీ స్థితిగతులపై ఆరా తీశారు. అందులో ఎంత మంది మహిళలు పెట్టుబడి పెట్టారు..? ఇప్పటి దాకా వారికి ఎలాంటి లబ్ధి చేకూరింది, అంశాలపై సమగ్ర నివేదికలు సమర్పించాలన్నారు.

ఐదు రోజుల్లో తేలికపాటి వర్షాలు

బుక్కరాయసముద్రం, జూన్ 28: ఉమ్మడి జిల్లాలో రానున్న ఐదు రోజుల్లో తేలిక పాటి వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ పరిశోధన కేంద్రం వాతావరణ శాస్త్రవేత్త గుత్తా నారాయణస్వామి తెలిపారు. ఉష్ణోగ్రతలు 33.6-34.8 డిగ్రీలు సెల్సియస్ నమోదు అయ్యే అవకాశాలున్నట్లు తెలిపారు. గాలులు గంటకు 6 కి.మీ వేగతంతో వీచే అవకాశం ఉందన్నారు.

అంతర సేద్యం చేసుకోవాలి: శాస్త్రవేత్త విజయశంకర్‌బాబు

ఉమ్మడి జిల్లాలో జూన్ మొదటి వారంలో సాగు చేసిన వేరుశనగ పంట శాఖీయ దశలో ఉంది. రైతులు అంతర సేద్యం చేసుకోవాలని ప్రధాన శాస్త్రవేత్త విజయ శంకర్‌బాబు సూచించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు రసం పీల్చే పురుగులు ఆశించడానికి అనుకూలమన్నారు. నివారణకు వేరుశనగ పొలంలో ఎకరాకు పది జిగట అట్టలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. వీటితో పాటు ఫెరోమోన్ ట్రాప్స్ ఎకరాకు నాలుగు అమర్చుకోవాలన్నారు. పురుగు ఉధృతిని బట్టి ఇమిడా క్లోప్రిడ్ 17.8ఎస్ఎల్ 10.3 లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు.
అంతరపంటగా రాగితో పాటు కందిని 8:2 నిష్పత్తిలో చిక్కుడును 8:1 నిష్పత్తిలో వేసుకోవాలన్నారు. రైతులు కూరగాయలను నాటే ముందు లీటరు నీటికి క్లోరిఫైరిపాస్ 2.5 మి.లీ, కార్బండిజమ్ 3గ్రాములు కలిపి మందు ద్రావణంలో వేర్లు ముంచిన తరువాత నాట్లు వేసుకోవాలన్నారు.

న్యాయవాదిపై దాడి

● హిజ్రాలతో పూలమాల వేయించి హేళన

● పోలీసులకు ఫిర్యాదు చేసిన న్యాయవాదుల సంఘం

కదిరి లీగల్, జూన్ 28: పట్టణంలోని కోర్టు ఎదుట నివాసముంటున్న న్యాయవాది రామస్వామిపై శుక్రవారం దాడి జరిగింది. బాధితుడు న్యాయవాదుల సంఘానికి విషయం తెలియజేసి, వారి సహకారంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడి కథనం మేరకు, మరో న్యాయవాది వరప్రసాద్ కలిసి తన క్లయింట్‌లతో రామస్వామి మాట్లాడుతున్నారు. ఆ సమయంలో సైదాపురానికి చెందిన పోలినేని శ్రీనివాసులు, రాగిరి జయరాం, గంగాధర్, నాగప్ప, అనిల్, పక్కీరప్ప వారి ఇంట్లోకి ప్రవేశించారు. ఓ అగ్రిమెంట్ డబ్బుల కేసు విషయంలో రామస్వామితో వాదనకు దిగారు. జూలై 4న వాయిదా ఉందని, సెటిల్ అవుతుందని ఆయన సమాధానం చెప్పేలోగా పోలినేని శ్రీనివాసులు న్యాయవాది రామస్వామిపై దాడి చేశారు. జయరాం కూడా దాడి చేశారు. బండబూతులు తిడుతూ బీభత్సం సృష్టించారు. వారితో పాటు వచ్చిన హిజ్రాలు న్యాయవాది కూర్చీ లాక్కుని కూర్చున్నారు. న్యాయవాది మెడలో పూలమాల వేసి అవహేళన చేశారు. దీంతో న్యాయవాది భార్య, పిల్లలు భయాందోళనకు గురయ్యారు. మరో న్యాయవాది వరప్రసాద్ నచ్చచెప్పే ప్రయత్నం చేయగా.. అతనిపైనా దాడి చేసేందుకు ప్రయత్నించారు. విషయం తెలుసుకుని పోలీసులు అక్కడికి చేరుకునేలోపు అందరూ పారిపోయారు. అనంతరం న్యాయవాదులిద్దరూ న్యాయవాదుల సంఘానికి జరిగిన విషయం తెలిపారు. అత్యవసరంగా సమావేశం నిర్వహించారు. అధ్యక్షుడు నాగేంద్రరెడ్డి ఆధ్వర్యంలో రెండురోజులు కోర్టు విధులు బహిష్కరించాలని తీర్మానం చేశారు. అనంతరం సీఐ పుల్లయ్యను కలిసి జరిగిన విషయాన్ని తెలిపారు. కేసు నమోదు చేసుకుని నిందితులను త్వరలో అరెస్టు చేస్తామని సీఐ హామీ ఇచ్చారు.



సంఘం కార్యాలయంలో దాడి గురించి వివరిస్తున్న న్యాయవాది రామస్వామి

ఏడీసీసీ బ్యాంకు పర్సన్ ఇన్‌చార్జిగా జేసీ కేతన్‌గార్గ్ బాధ్యతల స్వీకరణ



జేసీ కేతన్‌గార్గ్‌ను అభినందిస్తున్న డీసీఓ, సీఈఓ, అధికారులు

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 28: ఏడీసీసీ బ్యాంకు పర్సన్ ఇన్‌చార్జిగా జిల్లా జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు ఉన్న ఏడీసీసీ బ్యాంకు పాలకవర్గకమిటీ రాజీనామాతో రాష్ట్ర ప్రభుత్వంలో సొసైటీలు, డీసీఎంఎస్‌లతో పాటు ఏడీసీసీ బ్యాంకులకు పర్సన్ ఇన్‌చార్జిలను నియమించింది. డీసీఓ అరుణకుమారి, ఏడీసీసీ బ్యాంకు సీఈఓ సురేఖరాణి పర్సన్ ఇన్‌చార్జిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. బ్యాంకు ఆర్థిక లావాదేవీలు, ఇదివరకు చోటు చేసుకున్న పరిణామాలపై జేసీ అడిగి తెలుసుకున్నారు. సమష్టిగా పనిచేసి బ్యాంకును అభివృద్ధిలో పరుగులు పెట్టించాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీసీసీ బ్యాంకు డీజీఎంలు ఏబీ రాంప్రసాద్, సుఖదేవబాబు, సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

వైసీపీకి ప్రచారం చేసిన యానిమేటర్లపై చర్యలు తీసుకోవాలి

● డీఆర్‌డీఏ పీడీకి టీడీపీ నాయకుల ఫిర్యాదు

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 28: వైసీపీ తొత్తులుగా పనిచేసి, ఎన్నికల్లో ప్రచారం చేసిన యానిమేటర్లపై చర్యలు తీసుకోవాలని యాడికి మండల టీడీపీ అధ్యక్షుడు రుద్రమ నాయుడు డిమాండ్ చేశారు. శుక్రవారం డీఆర్‌డీఏ-వైకేపీ కార్యాలయంలో పీడీ ఈశ్వరయ్యను కలిసిన ఆయన ఆధారాలతో కూడిన ఫిర్యాదును అందజేశారు. యాడికి మండలంలో పెద్దపేటగ్రామ శివశక్తి గ్రామైఖ్య సంఘం యానిమేటర్‌గా పనిచేస్తున్న లక్ష్మీదేవి ఇటీవల జరిగిన ఎన్నికల్లో వైసీపీకి అనుకూలంగా ప్రచారం చేసిందన్నారు. వైసీపీ నేతలకు సుమారు 7డ్వాక్రా సంఘాలకు సంబంధించిన రూ.1.2కోట్లకు పైగా నిధులను దోచిపెట్టిందని ఫిర్యాదు చేశారు. వైసీపీకి ఊడిగం చేయడంతో పాటు మహిళ సొమ్మును మెక్కిన యానిమేటర్లపై చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై పీడీ స్పందిస్తూ విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



పీడీ ఈశ్వరయ్యకు ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నాయకుడు రుద్రమనాయుడు



బాధ్యతలు స్వీకరిస్తున్న ప్రొఫెసర్ సత్యనారాయణ

బాధ్యతలు చేపట్టిన జేఎన్‌టీయూ రిజిస్ట్రార్

అనంతపురం సెంట్రల్, జూన్ 28: జేఎన్‌టీయూ ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ సత్యనారాయణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గురువారం ప్రొఫెసర్ శశిధర్ రిజిస్ట్రార్‌గా రాజీనామా చేయడంతో తాత్కాలికంగా ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్‌గా సత్యనారాయణ నియమితులయ్యారు. దీంతో శశిధర్ ఆయనకు బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా బోధన, బోధనేతర సిబ్బంది సత్యనారాయణకు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు.

ఎస్కేయూ వీసీ బంగ్లా ఖాళీ...

ఎస్కేయూ వీసీగా హుస్సేన్‌రెడ్డి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. శుక్రవారం ఆయన వీసీ అధికారిక భవనాన్ని ఖాళీచేసి వెళ్లారు. దీంతో వర్సిటీ సూపరింటెండెంట్ ఇంజనీర్ మధుసూదన్‌రెడ్డి బంగ్లాకు తాళం వేసి స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా వ్యక్తిగత వినియోగానికి సంబంధించిన లావాదేవీలను క్లియర్ చేశారని అధికార వర్గాలు పేర్కొన్నాయి. జేఎన్‌టీయూ వీసీగా ప్రొఫెసర్ శ్రీనివాసరావు రాజీనామా చేసినా శుక్రవారం అధికారిక భవనంలో వున్నారు. ఆయన రాజీనామా రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ నుంచి ఆమోదం పొందేవరకు ఇక్కడే ఉండనున్నారు. అదేవిధంగా విశాఖపట్టణం ఆంధ్రా యూనివర్సిటీ ప్రొఫెసర్ కావడంతో సర్దుబాటుకు సమయం పడుతుందని అధికార వర్గాలు పేర్కొన్నాయి.

నిర్వహణకు నీళ్లొదిలారు..!



ముత్యాలచెరువు సచివాలయం

● సచివాలయాల పరిస్థితి దయనీయం

● నెలకు రూ.5వేల పైగా ఖర్చు

కదిరి అర్బన్, జూన్ 28: ప్రజలకు సేవలు మరింత చేరువ చేసేందుకు సచివాలయ వ్యవస్థను అందుబాటులోకి తెచ్చామని గొప్పగా చెప్పుకున్న గత వైసీపీ పాలకులు.. వాటి నిర్వాహణను మాత్రం గాలికొదిలేశారు. ప్రారంభంలో ప్రతి సచివాలయానికి కుర్చీలు, కంప్యూటర్లు, బల్లలు, స్టేషనరీ, ఇతర సామగ్రిని ప్రభుత్వం సరఫరా చేసింది. కొన్ని రోజులకే స్టేషనరీ సరఫరా ఆపేసింది. అప్పటినుంచి సచివాలయాల భారం పంచాయతీపై పడింది. అసలే ప్రభుత్వం నుంచి నిధులురాక సతమతమవుతున్న పంచాయతీలకు సచివాలయాల నిర్వహణ భారంగా మారింది.

నెలకు రూ.5 వేల పైమాటే..

సచివాలయాలు ప్రారంభించాక సకాలంలో స్టేషనరీ సరఫరా చేయకపోవడంతో వాటికోసం పంచాయతీ నిధులపై ఆధారపడ్డారు. ప్రారంభంలో నెలకు రూ.5వేలు నిర్వహణ ఖర్చుల కింద జమ చేస్తామన్నారు. ఆరు నెలల తరువాత అప్పటి వైసీపీ పాలకులు మాట మార్చారు. ప్రభుత్వమే స్టేషనరీ సరఫరా చేస్తుందనీ, దీంతో నెలకు రూ.రెండువేలు చొప్పున సచివాలయాల నిర్వహణకు మంజూరు చేస్తామని 2022లో చెప్పారు. తరువాత ఆ రూ.2 వేలు ఊసేలేదు. అవసరమైన సామగ్రి, ప్రింటర్లు, ఇంటర్నెట్, విద్యుత్ బిల్లులు, సంక్షేమ పథకాల లబ్ధిదారుల జాబితా ప్రింట్లు, ఇలా నిర్వహణ ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయి. వినియోగాన్ని బట్టి ఒక్కో సచివాలయంలో రూ.5 వేలనుంచి ఏడువేల వరకు ఖర్చవుతోంది. కేంద్రం ఇచ్చిన ఆర్థిక సంఘం నిధులను అప్పటి వైసీపీ ప్రభుత్వం విద్యుత్ బిల్లుల పేరుతో వెనక్కు తీసుకోవడంతో 90శాతంపైగా పంచాయతీల్లో ఖజానా ఖాళీ అయింది. దీంతో ప్రతి పనికి సాధారణ నిధులపైనే ఆధారపడాల్సి వచ్చింది. మైనర్ పంచాయతీల్లో ఇంటి, నీటి పన్నుల ద్వారా సమకూరే ఆదాయం రూ. వేలల్లో ఉంటుంది. వీటితో పారిశుధ్యం, వీధి దీపాల నిర్వహణ, కార్మికుల వేతనాలతోపాటు, సచివాలయాల ఖర్చు కూడా భరించాల్సి రావడం ఇబ్బందిగా మారింది.

సర్వీస్ చార్జీలు ప్రభుత్వానికే..

సచివాలయాల ద్వారా ప్రస్తుతం 543 రకాలకుపైగా సేవలు అందుతున్నాయి. వాటి ద్వారా సమకూరే నిర్ణీత చార్జీలను సచివాలయ సిబ్బంది ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి జమ చేయాల్సిందే. అన్నీ తీసుకుని కనీసం ఇంటర్నెట్ చార్జీలు కూడా చెల్లించట్లేదు. దీంతో ఆదాయంలేని పంచాయతీల్లో సర్పంచ్‌లు, కార్యదర్శులు తలలు పట్టుకుంటున్నారు. అద్దె భవనాల్లో ఉన్నవాటికి నెలనెలా చెల్లింపులు సమస్యగా మారింది. ఆన్‌లైన్ ద్వారా ఏ సేవ అందించాలన్నా ఇంటర్నెట్ సదుపాయం తప్పని సరి. వాటికి సంబంధించిన బిల్లులుకూడా గత వైసీపీ ప్రభుత్వం జమ చేయలేదు. దీంతో సచివాలయాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది.

అస్తవ్యస్తం: భాస్కర్, సర్పంచ్, బూరుగుపల్లి



సచివాలయాల నిర్వహణను గత వైసీపీ ప్రభుత్వం అస్తవ్యస్తంగా మార్చింది. సర్వీస్ చార్జీల రూపంలో వచ్చిన సొమ్మును ప్రభుత్వ ఖజానాకు జమ చేయాలి. నిర్వహణకు మాత్రం ప్రభుత్వం పైసాకూడా ఇచ్చేదికాదు. దీంతో పంచాయతీ డబ్బులే ఖర్చు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది.

నిధులివ్వలేదు: అంజినప్ప, ఎంపీడీఓ, కదిరి

సచివాలయాల నిర్వహణకు గత ప్రభుత్వం నిధులు మంజూరు చేయలేదు. పంచాయతీలే భరించేవి. సర్వీస్ చార్జీలు, ఎప్పటికప్పుడు ప్రభుత్వ ఖజానాకు జమ చేయాల్సి వచ్చేది.

అప్పుల ఒత్తిడితో రైతు ఆత్మహత్య



చాకలి నాగప్ప(ఫైల్)

నార్పల, జూన్ 28: మండల కేంద్రంలోని చైతన్య కాలనీకి చెందిన రైతు చాకలి నాగప్ప(46) అప్పుల ఒత్తిడి భరించలేక శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నాడు. నాగప్పకు 1.30 ఎకరాల పొలం ఉంది. వ్యవసాయంతోపాటు వృత్తి పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. వ్యవసాయం, కుటుంబ పోషణ కోసం సుమారు రూ.14 లక్షలు అప్పు చేశాడు. ఇందులో రూ.9 లక్షలు అనంతపురం నగరంలోని ఓ ప్రైవేటు ఫైనాన్స్ సంస్థలో తీసుకున్నాడు. రుణం చెల్లించకపోవడంతో వారు నోటీసులు జారీ చేశారు. అప్పు ఇచ్చిన ఇతరుల నుంచి సైతం ఒత్తిడి మొదలైంది. దిక్కుతోచని స్థితిలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. అపస్మారక స్థితిలో ఉండగా గమనించిన కుటుంబ సభ్యులు అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. నాగప్పకు భార్య, ఒక కుమారుడు, కూతురు ఉన్నారు. రైతు భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు.

యువకుడి దారుణ హత్య



వన్నూరు స్వామి (ఫైల్)

కళ్యాణదుర్గం రూరల్, జూన్ 28: మున్సిపాలిటీ పరిధిలోని కురాకులతోట సమీపంలో కొండ వద్ద వన్నూరుస్వామి(30) అనే యువకుడిని గుర్తు తెలియని వ్యక్తులు గొంతు కోసి హత్య చేశారు. రక్తపు మడుగులో పడి ఉన్న యువకుడిని అటుగా వెళ్లిన పశువుల కాపరులు శుక్రవారం గుర్తించి, పోలీసులకు సమాచారం ఇచ్చారు. పట్టణ సీఐ హరినాథ్ తన సిబ్బందితో వెళ్లి పరిశీలించారు. హత్య జరిగిన ప్రాంతంలో మద్యం బాటిళ్లు, గ్లాసులు ఉన్నాయి. పక్కా ప్రణాళికతో మద్యం సేవించిన అనంతరం ఈ హత్య చేసినట్లు పోలీసులు భావిస్తున్నారు. హత్యకు కారణాలు ఏమిటో తెలుసుకునేందుకు భిన్నమైన కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. వన్నూరుస్వామికి భార్య శ్రీవాణి, కుమారుడు, కూతురు ఉన్నారు. శ్రీవాణి ఆర్డీటీ ఆసుపత్రిలో స్వీపర్‌గా పనిచేస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.



రక్తపు మడుగులో వన్నూరుస్వామి

అన్నిగ్రూపుల రక్తం నిల్వ ఉండాలి

● బాధితులను రక్తనిధి కేంద్రాలు ఆదుకోవాలి ● రెడ్‌క్రాస్ సేవా కార్యక్రమాలపై సమీక్షలో కలెక్టర్

అనంతపురం టౌన్, జూన్ 28: రక్తనిధి కేంద్రాల్లో అన్ని గ్రూపుల రక్తం నిల్వ ఉండాలని, అత్యవసర కేసులు ఎప్పుడు వచ్చినా వారికి రక్తం అందించాలని వైద్యాధికారులను కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ ఆదేశించారు. శుక్రవారం జిల్లా రెడ్‌క్రాస్ కార్యక్రమాలపై కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో రక్తం కొరత లేకుండా చూడాలన్నారు. ప్రతి వారం రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసి కనీసం 100యూనిట్ల రక్తం సేకరించేలా ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. ఈకార్యక్రమంలో కాలేజీ విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు, బ్యాంకులు, ప్రభుత్వశాఖల ప్రమేయం ఉండేలా చూడాలన్నారు. రెడ్‌క్రాస్‌లో ప్రతి సభ్యుడు మానవత్వంతో పనిచేయాలని సూచించారు. రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంకులో అన్ని సదుపాయాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రెడ్‌క్రాస్ ప్రథమ చికిత్సా కేంద్రాలు పెద్ద ఎత్తున చేపట్టాలని సూచించారు. రెడ్‌క్రాస్‌కు విరివిగా విరాళాలు అందించి అభివృద్ధికి సహకరించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. రక్తదానం చేయడానికి అందరూ ముందుండాలన్నారు. రక్తదానం ప్రయోజనాలను అందరికీ వివరించి, రక్తదానాన్ని మరింత విస్తృతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం రెడ్‌క్రాస్ శాశ్వత సభ్యుడిగా కలెక్టర్ సభ్యత్వం తీసుకున్నారు. ఈసందర్భంగా రక్తదాతల సేవలను కొనియాడుతూ సత్కరించి అభినందించారు. రక్తదానం ఎందరికో ప్రాణదానమని, వైద్యులు పాల్గొనడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ రాష్ట్ర సభ్యులు మాజీ ఎంఎల్‌ఏ కాపురామచంద్రారెడ్డి, రెడ్‌క్రాస్ సంస్థజిల్లా చైర్ పర్సన్ కాపుభారతి, డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈబీ దేవి, డ్రగ్స్ కంట్రోల్ డీడీ రమేష్‌రెడ్డి, రెడ్‌క్రాస్ సెక్రటరీ మోహన్‌క్రిష్ణ పాల్గొన్నారు.



రక్తదాత, కార్డియాలజీ వైద్యుడు సుభాష్ చంద్రబోస్‌ను సత్కరిస్తున్న కలెక్టర్ వినోద్ కుమార్

సంక్షిప్తంగా..

అనర్హుల పింఛన్లు తొలగించాలి

ఆత్మకూరు, జూన్ 28: మండలంలో అనర్హుల పింఛన్లు తొలగించాలని హిందూపురం పార్లమెంటు అధికార ప్రతినిధి శశాంక చౌదరి కోరారు. అనంతపురం పరిటాల క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. వైసీపీ పాలనలో చాలా మంది అనర్హులు దొంగ సర్టిఫికెట్లు పెట్టి పింఛన్లు పొందుతున్నారని, దీంతో అర్హులకు అన్యాయం జరుగుతోందని అన్నారు. అధికారులు విచారణ చేపట్టి.. ఆ అనర్హులను తొలగించి... అర్హులైన పేదలకు పింఛన్లు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ఇంటి వద్దకే పింఛన్

గార్లదిన్నె, జూన్ 28 : ఇంటివద్దకే పింఛన్ డబ్బులు అందజేస్తామని ఎంపీడీఓ వెంకటలక్ష్మి తెలిపారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది జూలై 1న ఉదయం 6 గంటలకు పింఛన్లు పంపిణీ చేయాలన్నారు. ఒక్కొక్క ఉద్యోగి 50 మంది పింఛన్‌దారుల చొప్పున పంపిణీ చేయాలని సూచించారు. మండలంలో 7,872 పింఛన్‌దారులు ఉన్నారని, వారికి 7,33,28,000 పంపిణీ చేస్తామని అన్నారు.

శింగనమల: సామాజిక పింఛన్లు జూలై ఒకటో తేదీన ఇంటి వద్దనే పంపిణీ చేస్తారని ఎంపీడీవో బి.వెంకటరమణ తెలిపారు. శుక్రవారం శింగనమల ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు గ్రామ సచివాలయం సిబ్బందితో పింఛన్ల పంపిణీపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో 6,497 మంది పింఛన్‌దారులు ఉన్నారని, వారికి రూ.4,47,01,500 మంజూరైందని తెలిపారు. జూలై ఒకటోతేదీన గ్రామసచివాలయం సిబ్బందితో ఇంటి వద్దనే ఆ సొమ్ము పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.

వైద్యుడిపై క్రిమినల్ కేసు

చెన్నేకొత్తపల్లి, జూన్ 28: లైంగిక వేధింపుల ఆరోపణలున్న మండలంలోని ఎన్ఎస్‌గేటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు ఉదయ్‌కుమార్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. పలువురు ఏఎన్ఎంలు.. అతడిపై గురువారం ఫిర్యాదు చేశారన్నారు. దీంతో ఆ వైద్యుడిపై క్రిమినల్ కేసు నమోదు చేసి విచారిస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

పంట మార్పిడితో అధిక దిగుబడులు

రాప్తాడు, జూన్ 28: రైతులు ఒకే రకమైన పంట సాగు చేసే తీవ్రంగా నష్టపోతున్నారని, పంట మార్పిడిచేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా వనరుల కేంద్రం డీడీఏ మద్దిలేటి పేర్కొన్నారు. శుక్రవారం రాప్తాడులోని రైతు భరోసా కేంద్రంలో రైతులతో పంటల సాగుపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో ఆయన మాట్లాడుతూ... ఖరీఫ్ సీజన్‌లో రైతులు ఎక్కువగా వేరుశనగ పంట సాగుచేయడం వల్ల నష్టపోతున్నారని, అలా కాకుండా పంట మార్పిడి చేస్తే పంటలు మంచి దిగుబడులు సాధించవచ్చని అన్నారు. రైతులు అందరు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎఫ్‌టీసీ ఏడీఏ శైలజకుమారి, ఏఓ శేఖర్‌రెడ్డి, ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.

2న ప్రజావేదిక

గార్లదిన్నె, జూన్ 28: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంపై మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణంలో సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వెంకటలక్ష్మి, ఏపీఓ నాంచారమ్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత సంవత్సరంలో అన్ని పంచాయతీల్లో జరిగిన పథకాలపై సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహిస్తామన్నారు. ఇప్పటికే పథకాలపై సామాజిక తనిఖీ బృందం క్షేత్రస్థాయిలో పరిశీలించిందన్నారు.

వెటరన్ క్రికెట్ పోటీల్లో అనంత, హైదరాబాద్ విజయం

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 28: స్థానిక అనంత క్రీడాగ్రామం ఆర్డీటీ స్టేడియంలో శుక్రవారం నిర్వహించిన వెటరన్ క్రికెట్ పోటీల్లో అనంతపురం, హైదరాబాద్ జట్లు విజయం సాధించాయి. అనంతపురం, కడప జట్లు పోటీ పడగా... మొదట బ్యాటింగ్ చేసిన అనంతపురం జట్టు నిర్ణీత 20 ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి 193 పరుగులు చేసింది. అనంతరం బరిలోకి దిగిన కడప 20 ఓవర్లలో ఎనిమిది వికెట్లు కోల్పోయి 134పరుగులు మాత్రమే చేసి ఓటమిపాలైంది. మరోమ్యాచ్ విజయవాడ-హైదరాబాద్ జట్ల మధ్య జరగగా... మొదట బ్యాటింగ్ చేసిన విజయవాడ నిర్ణీత 20 ఓవర్లలో ఏడు వికెట్లు కోల్పోయి 125 పరుగులు మాత్రమే చేసింది. అనంతరం బరిలోకి దిగిన హైదరాబాద్ 13.1 ఓవర్లలో 126 పరుగులు చేసి విజయం సాధించింది.

7న కమిటీ ఎంపిక

అనంతపురం ప్రెస్‌క్లబ్: అఖిలగాండ్ల తెలికుల సంక్షేమ సంఘం నూతన కమిటీని వచ్చేనెల 7న ఎంపిక చేస్తున్నట్లు ఆ సంఘం అడహక్ కమిటీ అధ్యక్షుడు సుభాష్‌చంద్రబోస్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. సంఘం అభివృద్ధి, గాండ్ల తెలికుల సంక్షేమం కోసం పూర్తిస్థాయి అధికారిక కార్యవర్గాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. శ్రీ బాలాజీ కల్యాణమండపంలో ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. సమావేశానికి కులస్థులందరూ హాజరుకావాలని కోరారు.

ఆలయ అధ్యక్షుడిగా ఆలూరు లక్ష్మణ్‌రావు

గుత్తి, జూన్ 28: గుత్తి పట్టణంలోని ఆరె కటికల ఆరాధ్య దైవమైన సునామ జకినీ మాత అమ్మవారి ఆలయ నూతన అధ్యక్షుడిగా అనంతపురానికి చెందిన మల్కారి ఆలూరు లక్ష్మణ్‌రావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆ ఆలయంలో శుక్రవారం ఆలయ నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని నిర్వహించారు.

ప్రైవేట్ స్కూళ్లపై చర్యలు తీసుకోవాలి

అనంతపురం విద్య, జూన్ 28: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లపై చర్యలు తీసుకోవాలని పీఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆ సంఘం రాష్ట్ర కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఇన్‌చార్జ్ సతీష్, రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్, ప్రధాన కార్యదర్శి శివ మాట్లాడుతూ... ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లలో ఫీజుల పేరుతో లక్షలాది రూపాయలు గుంజుతున్నారన్నారు. యూనిఫాం, పుస్తకాల పేరుతో వ్యాపారం చేస్తున్నారని మండిపడ్డారు. అలాంటి సంస్థలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. నూతన జాతీయ విద్యావిధానంలో మార్పులు తేవాలని, విద్యార్థులు అన్ని దశల్లోనూ ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు విద్యా పూర్తి కాగానే... ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేలా ప్రభుత్వాలు అన్నిచర్యలు తీసుకోవాలన్నారు. నిరుద్యోగాన్ని తగ్గించాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రతిభా భారతి, ఇతర నాయకులు ప్రసన్న కుమార్, రవికుమార్, జీవన్‌కుమార్, వలి, అఫ్రిదీ, మౌనిక, వసంత పాల్గొన్నారు.

19 నుంచి గురుపూర్ణిమ వేడుకలు

తాడిపత్రిటౌన్: పట్టణంలోని శివాలయంరోడ్డులో ఉన్న షిర్డిసాయిబాబా మందిరంలో జూలై 19 నుంచి 21వ తేదీ వరకు గురుపూర్ణిమ వేడుకలు జరగనున్నాయి. 19న అభిషేకం, మహాగణపతి, నవగ్రహ, రుద్ర, చండీహోమాలు, పవన, దత్త శ్రీసాయి హోమం, 20న కాశీ, రామేశ్వరం తదితర పుణ్యతీర్థాల నదుల నీటితో అభిషేకం, మహన్యాసపూర్వక రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం సాయంత్రం విష్ణు సమస్రనామ పారాయణం, భజనలు, పల్లకి సేవ తదితర పూజా కార్యక్రమాలు జరగనున్నాయి. 21న కాకడ హారతి, మహన్యాసపూర్వక ఏకాదశవార రుద్రాభిషేకం, మహామంగళహారతి నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.



నడిమివంక



మరువవంక

వంక ఆక్రమణలపై ఉక్కుపాదం?

అనంతపురం క్రైం, జూన్ 28: చిన్నది.. పెద్దది.. అని కాదు.. నగరంలో అన్ని కాలువలు, వంకలు ఆక్రమణకు గురయ్యాయి. కాలువలపైనే చాలా వరకు బిల్డింగ్‌లు నిర్మించినప్పుడల్లా మెట్లన్నీ ఇళ్ల ముందు వెళ్లే కాలువలపైనే నిర్మించారు. వరదలు, భారీ వర్షాలొస్తే నీరు వెళ్లడానికి మురుగుకాలువలు ఏర్పాటు చేశారు. వాటిలోని 80 శాతం కాలువలపై పెద్దపెద్ద భవనాలు నిర్మించారు. నగరంలో మరువవంక, నడిమివంక ప్రధాన కాలువలు. అటు తిరిగి ఇటు తిరిగి మురికి కాలువలన్నీ ఈ కాలువల్లోనే కలుస్తాయి. ఈ కాలువలు దశాబ్దాల కాలంగా ఆక్రమణలతో కుంచించుకుపోయాయి. ఇప్పుడా ఆక్రమణదారులకు నగరపాలిక అధికారులు షాక్ ఇచ్చారు. కాలువలను ఆక్రమించుకొని భవనాలు నిర్మించుకున్న వారికి నోటీసులు జారీ చేశారు. రానున్న వర్షాల నేపథ్యంలో అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్.. కలెక్టర్‌కు సూచనలు చేయడం, కలెక్టర్ చర్యలు తీసుకోవాలని కమిషనర్‌కు సూచించడం జరిగింది. దీంతో కమిషనర్ ఆదేశాల మేరకు టౌన్‌ప్లానింగ్ అధికారులు ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేశారు. ఆక్రమణలో ఉన్న వాటిని స్వచ్ఛందంగా తొలగించుకోవాలని అందులో పేర్కొన్నారు.



ఏడాదిన్నర కిత్రం కురిసిన వర్షాలకు జలమయమైన రజకనగర్

- నడిమివంక, మరువ వంకలపై ప్రత్యేక దృష్టి
- 530 ఆక్రమణలకు నోటీసులు
- తొలగింపు సాధ్యమేనా..?
- రాజకీయ జోక్యం ఉంటుందా..?
- తమకు తెలియకుండా నోటీసులు ఇవ్వడంపై పాలకవర్గం గుర్రు

530 ఆక్రమణలకు నోటీసులు

నగరంలో వంకల ఆక్రమణలు చాలానే ఉన్నాయి. నడిమివంక రవి పెట్రోల్ బంక్ నుంచి ప్రారంభమై ఆరోరోడ్డు, సోమనాథ్ నగర్ల మీదుగా తడకలేరులో కలుస్తుంది. మొత్తం ఐదు కిలోమీటర్ల పైచిలుకే ఉంటుంది. మరువవంక కలెక్టరేట్ సమీపం నుంచి ప్రారంభమై ఎర్రనేల కొట్టాల మీదుగా తడకలేరులో కలుస్తుంది. ఈ వంక సుమారు ఆరు కిలోమీటర్ల మేర పారుతుంది. కొన్నేళ్లుగా మరువవంక, నడిమివంక చుట్టూ ఆక్రమణలు అధికమయ్యాయి. కొందరు చిన్న చిన్న ఇళ్లు కట్టుకుంటే, కొందరు బిల్డింగ్‌లే నిర్మించేశారు. మరువవంక పరిధిలో 305, నడిమివంక పరిధిలో 225 ఆక్రమణలకు నగరపాలిక టౌన్‌ప్లానింగ్ అధికారులు నోటీసులిచ్చారు. మొత్తం 530 ఆక్రమణలకు నోటీసులిచ్చేశారు. ఆయా వంకల రిటైనింగ్ వాల్ పరిధికి రెండు మీటర్ల దూరం నుంచి 10 మీటర్ల దూరం వరకు ఆక్రమణలకు నోటీసులిచ్చినట్లు సమాచారం.

తొలగింపు సాధ్యమేనా...?

దశాబ్దాలుగా నడిమివంక, మరువ వంకలు ఆక్రమణలతో కుంచించుకుపోయాయి. కొన్ని చోట్ల 13 అడుగుల వెడల్పు ఉండగా కొన్ని చోట్ల కనీసం ఎనిమిది అడుగులు కూడా లేని దుస్థితి. ఈ క్రమంలోనే ఆక్రమణల సంఖ్య బాగా పెరిగిపోయింది. రిటైనింగ్ వాల్ ఎక్కడుందనేది కూడా చాలా ప్రాంతాల్లో కనిపించదంటే ఆక్రమణలు ఏ పరిస్థితుల్లో ఉన్నాయో అర్థమవుతుంది. ఇవన్నీ ఇలా ఉంటే ఇప్పుడు చర్చంతా అధికారులు నోటీసులివ్వడంతో ఆక్రమణల తొలగింపు సాధ్యమేనా..? అనే అంశంపైనే జరుగుతోంది. ఇప్పటికే కొందరు కార్పొరేటర్లు, స్థానిక నాయకుల దృష్టికి, అధికారుల దృష్టికి తీసుకెళ్లారట. వాటిని తొలగించకుండా చూడాలని కోరుతున్నట్లు సమాచారం. ఆక్రమణల తొలగింపు విషయంలో రాజకీయ జోక్యం ఉంటుందా..? అనే సందేహం తలెత్తుతోంది. దీనికి కాలమే సమాధానం చెప్పాలి.

పాలకవర్గం గుర్రు...

ఆక్రమణలపై అధికారులు నోటీసులివ్వడంపై ఇక్కడ పాలకవర్గం గుర్రుగా ఉందట. మేయర్, డిప్యూటీ మేయర్లు టౌన్‌ప్లానింగ్ అధికారులపై అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. ఇందుకు కమిషనర్ ఆదేశాల మేరకే ఇచ్చామని అధికారులు చెప్పారట. కమిషనర్ అడిగితే... వర్షాకాలం నేపథ్యంలో అత్యవసర పరిస్థితుల్లో ఇవ్వాల్సి వచ్చిందని చెప్పినట్లు తెలిసింది. ఆక్రమణలపై త్వరలో జరిగే కౌన్సిల్ సమావేశంలో చర్చకు దారి తీసే అవకాశముంది.

పండుగలా పింఛన్ల పంపిణీ

ఆత్మకూరు, జూన్ 28: ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు పింఛన్లను పెంచారని, దీంతో వచ్చే నెల ఒకటో తేదీన పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఓ పండుగలా నిర్వహిస్తున్నామని టీడీపీ మండల కన్వీనర్ శ్రీనివాసులు, తెలుగు యువత ప్రధాన కార్యదర్శి నారాయణస్వామి, హిందూపురం పార్లమెంటు అధికార ప్రతినిధి శశాంక చౌదరి అన్నారు. ఆ కార్యక్రమాన్ని స్థానిక రామలింగేశ్వర కళ్యాణమంటపంలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. శుక్రవారం ఆ ఏర్పాట్లును పరిశీలించిన వారు మాట్లాడారు. ఎమ్మెల్యే పరిటాల సునీత ఈ కార్యక్రమంలో పాల్గొంటారని, కావున పార్టీ నాయకులు, కార్యకర్తలు విరివిగా హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.



ఎమ్మెల్యే పరిటాల సునీతకు అభినందనలు తెలుపుతున్న వద్దుపల్లి గ్రామస్థులు

ఎమ్మెల్యేకు పలువురి అభినందనలు

రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీతను వద్దుపల్లి గ్రామస్థులు జిల్లా కేంద్రంలోని ఆమె క్యాంపు కార్యాలయంలో శుక్రవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. గ్రామ సమస్యలు, పరిస్థితిని ఎమ్మెల్యే అడిగి తెలుసుకొన్నారు. కార్యక్రమంలో మండల క్లస్టర్ ఇన్‌చార్జి క్రిష్ణ మోహన్ చౌదరి, టీడీపీ నాయకులు శ్రీనివాసులు, నారాయణస్వామి, గంగాధర్, ధనుంజయ, రామంజి, నరేష్, కుంటెన్న, కార్యకర్తలు పాల్గొన్నారు.

సికిల్ సెల్ నియంత్రణపై అవగాహన

అనంతపురం క్రైం, జూన్ 28: ఎర్రరక్త కణాల రుగ్మతల (సికిల్ సెల్ అనీమియా)పై నియంత్రణకు కృషి చేద్దామని రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమం(ఆర్‌బీఎస్‌కే) జిల్లా మేనేజర్ రజితారెడ్డి పిలుపునిచ్చారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నగరంలోని 45, 48 సచివాలయ పరిధిలోని గిరిజన బాల, బాలికల వసతిగృహాల్లో శనివారం సికిల్ సెల్ వ్యాధి లక్షణాలు, నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. వైద్యులు రజితారెడ్డి మాట్లాడుతూ... సికిల్ సెల్ అనీమియా వారసత్వంగా వచ్చే ఎర్ర రక్తకణాల రుగ్మతల సమూహమన్నారు. హిమోగ్లోబిన్ ఉత్పత్తికి కారణమయ్యే జన్యువుల లోపం ఉంటుందనా నరు. ఈ వ్యాధి కారణంగా రక్తకణాల సంఖ్య తగ్గడం, కళ్లు పసుపు రంగులోకి మారటం, తీవ్రమైన ఒళ్లునొప్పులు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఉంటుందన్నారు. అప్పుడే జన్మించిన బిడ్డ నుంచి 40 ఏళ్లలోపు గిరిజనులందరూ పరీక్ష చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు నారాయణస్వామి, సత్యప్రియ, ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ రామాంజనేయులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది

ధరల విషయమై వివాదం

అనంతపురం క్రైం, జూన్ 28 : డిజైనింగ్ బ్లౌజ్ ధరల విషయమై బోటిక్ సెంటర్ల నిర్వాహకులకు, కోల్‌కత్తాకు చెందిన డిజైనర్ల మధ్య వివాదం నెలకొంది. కోల్‌కత్తాకు చెందిన కొందరు నగరంలో కొన్ని ప్రాంతాల్లో బ్లౌజ్‌లకు మగ్గం డిజైన్లు వేసే దుకాణాలను ఏర్పాటు చేసుకున్నారు. వారు తక్కువ ధరలకు విక్రయిస్తుండటం నగరంలోని కొందరు బోటిక్ సెంటర్ నిర్వాహకులకు సరిపోలేదు. దీంతో శుక్రవారం కొందరు నిర్వాహకులు రహమత్‌నగర్‌లోని ఆయా సెంటర్ల వద్దకు వెళ్లి.. వారు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ బోర్డులు తొలగిస్తూ దౌర్జన్యాలకు దిగారు. తక్కువ ధరలకు ఎలా ఇస్తారంటూ మండిపడ్డారు. ఈ ఘటనపై టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు అందింది. దీంతో ఇరువర్గాలతో మాట్లాడతానని సీఐ క్రాంతికుమార్ తెలిపారు.

ముగిసిన రాయలసీమ కింగ్స్ శిక్షణశిబిరం

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 28: స్థానిక అనంత క్రీడాగ్రామం ఆర్డీటీ స్టేడియంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న రాయలసీమ కింగ్స్ జట్టు శిక్షణా శిబిరం శుక్రవారంతో ముగిసింది. విశాఖపట్నంలో నిర్వహించే ఆంధ్రా ప్రీమియర్ లీగ్ సీజన్-3 క్రికెట్ పోటీల్లో రాయలసీమ కింగ్స్ జట్టు పాల్గొంటోంది. రాయలసీమ కింగ్స్ జట్టులో జిల్లా క్రీడాకారులు కెప్టెన్ గిరినాథ్‌రెడ్డి, ప్రశాంత్‌కుమార్, వీరీరెడ్డి, వినయ్‌కుమార్ ఉన్నారు.



శిక్షణ పూర్తి చేసుకున్న రాయలసీమ కింగ్స్ జట్టు

వాహనాల పార్కింగ్ అడ్డాగా పెన్నార్ భవన్

అనంతపురం ప్రెస్‌క్లబ్, జూన్ 28: పెన్నార్ భవన్ (ఎస్సీ ఎస్టీ సంక్షేమశాఖలు, కార్పొరేషన్‌లు) కార్యాలయం కార్లు, బైకల పార్కింగ్‌కు అడ్డాగా మారుతోంది. పెన్నార్ భవన్ గేటు బయట కనీస సెక్యూరిటీ లేకపోవడంతో ఎవరుపడితే వారు వాహనాలను అక్కడ పార్క్ చేసి వెళ్తున్నారు. అసలు ఎవరు లోపలికి వస్తున్నారో... ఎవరు వెళ్తున్నారో తెలియని అయోమయ పరిస్తితి నెలకొంది. వారం రోజులుగా ఆర్టీసీకి సంబంధించిన కార్గో పార్సిల్ సర్వీసు వ్యాన్, ఒక కారు అక్కడే ఉన్నాయి. తార రోడ్డు వేసే యంత్రాన్నీ పార్క్ చేశారు. సమీప ప్రాంతాల్లోని వ్యక్తులు ఊళ్లకు వెళ్లే సమయంలో పెన్నార్ భవన్‌లో తమ వాహనాలను పార్కింగ్ చేసి వెళ్తున్నారు.







పెన్నార్ భవన్ ఆవరణలో ఉన్న ఆర్టీసీ కార్గో పార్సిల్ సర్వీస్ వ్యాన్, కారు, తారురోడ్డు వేసే యంత్రం, బైకులు

హుండీ ఆదాయం లెక్కింపు

గార్లదిన్నె, జూన్ 28: మండలంలోని కోటంక సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలోని రెండు హుండీల ద్వారా ఇచ్చిన ఆదాయాన్ని శుక్రవారం లెక్కించారు. రూ. 1,12179 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ బాబు తెలిపారు. ఆలయంలో మొత్తం నాలుగు హుండీలు ఉండగా.. అందులో రెండు చోరీకి గురయ్యాయని, మిగిలిన రెండింటిలోని ఆదాయాన్ని దేవాదయశాఖ తనిఖీ అధికారి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో లెక్కించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచు ఎర్రిస్వామి, మాజీ చైర్మన్ జయరాం, ఆలయ ప్రధాన అర్చకులు రామాచార్యులు, వెంకటేశులు, సత్యానారాయణరెడ్డి, రంగారెడ్డి పాల్గొన్నారు.



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

జిల్లా జైలును పరిశీలించిన న్యాయాధికారి



ఖైదీల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న న్యాయాధికారి

బుక్కరాయసముద్రం, జూన్ 28: అనంతపురం జిల్లా జైలును న్యాయసేవల ప్రాధికార సంస్థ కార్యదర్శి, న్యాయాధికారి శివప్రసాద్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా జైలులోని రిమాండ్ ఖైదీలను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఖైదీలకు అందుతున్న ఆహారం, వసతి, ఆరోగ్య స్థితిగతులపై ఆరా తీవారు. రిమాండ్ ఖైదీలు ఉచితంగా న్యాయసేవలు పొందవచ్చుని తెలిపారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ రెహమాన్ పాల్గొన్నారు.

రైతులకు తెలీకుండా మోటార్లకు మీటర్లు

గార్లదిన్నె, జూన్ 28 : వ్యవసాయ విద్యుత్ మోటార్లకు కాంట్రాక్టర్ మీటర్లను బిగించారు. శుక్రవారం ఉదయం గార్లదిన్నె మండలంలోని తిమ్మంపేట, పాపనేపాళ్యం గ్రామాల్లో మీటర్లు ఏర్పాటు చేసేందుకు కాంట్రాక్టర్ ఆదేశాల మేరకు ఆ కంపెనీ సిబ్బంది ప్రత్యేక వాహనంలో మీటర్లను తీసుకొని వెళ్లారు. ఆయా గ్రామాల రైతులు మీటర్లు ఏర్పాటు చేస్తే ఊరుకునేది తేదని వ్యతిరేకించారు. దీంతో సిబ్బంది అక్కడి నుంచి వెనుతిరిగారు. తిరిగి సాయంత్రం సమయంలో గార్లదిన్నె మండల కేంద్రం సమీపంలోని పొలాల్లో రైతులులేని సమయంలో వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగించి వెళ్లిపోయారు. సాయంత్రం తమ పొలాల వద్దకు వెళ్లిన రైతులు ఇది గమనించి ఆశ్చర్యపోయారు. తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా మీటర్లపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో మీటర్లు వద్దని వ్యతిరేకించామని, ఇప్పుడేమో తమకు తెలియకుండా మీటర్లు ఎలా బిగిస్తారని ప్రశ్నించారు. ఇదే విషయంపై ట్రాన్స్‌కో ఏడీ రవిశంకర్‌ను వివరణ కోరగా... తనకు ఎలాంటి సమాచారం లేదని, ఎవరూ బిగించారో తెలియదని, ఉన్నతాధికారులతో చర్చించి వివరాలు తెలియజేస్తామని సమాధానం చెప్పడం గమనార్హం.



నూతన పీడీకి పలువురి శుభాకాంక్షలు

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 28: డీఆర్‌డీఏ-వైకేపీ పీడీగా బాధ్యతలు స్వీకరించిన ఈశ్వరయ్యను శుక్రవారం కార్యాలయంలోని ఆయన చాంబర్‌లో పలువురు ఏసీలు, డీపీఎంలు, ఏపీఎంలు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. డ్వాక్రా సంఘాల మహిళలను బలోపేతం చేయడానికి అందరూ సహకరించాలని కోరారు. డ్వాక్రా సంఘాలకు పూర్వవైభవం తీసుకురావడానికి సమష్టి కృషి చేద్దామన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీలు గంగాధర్, రవీంద్రబాబు, ఏపీఎంలు మల్లికార్జున, శ్రీరాములు, సుభద్రమ్మ, శివప్రసాద్, ఖలీల్, సీసీలు పాల్గొన్నారు.



డీఆర్‌డీఏ పీడీని కలిసిన ఉద్యోగులు

బ్యాడ్మింటన్ పోటీలో విజేత ముస్కిన్



విజేతకు బహుమతులు అందజేస్తున్న సభ్యులు

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 28: షటిల్ బ్యాడ్మింటన్ అండర్-19 బాలికల విభాగం సింగిల్స్ క్యాటగిరిలో విజేతగా షేక్ ముస్కిన్ నిలిచింది. జిల్లా స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్-2024 పోటీలు శుక్రవారం అశోక్‌నగర్ డీఎస్ఏ ఇండోర్‌స్టేడియంలో నిర్వహించారు. ఇందులో అండర్-19 బాలికల విభాగంలో విజేతగా షేక్ ముస్కిన్, ద్వితీయ స్థానంలో రిడి నిలిచారు. అండర్-11 బాలుర డబుల్స్ విభాగంలో కార్తిక్ రెడ్డి-నిహాల్ రెడ్డి జోడి విజేతగా నిలవగా, రన్నర్స్ దర్శన్-భనేష్‌రెడ్డి నిలిచారు. విజేతలకు జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు బుగ్గయ్యచౌదరి, టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు పోతుల లక్ష్మినరసింహులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి జయకుమార్, ఉపాధ్యక్షుడు మహ్మద్‌షఫీ, సహాయ కార్యదర్శి అబ్దుల్ అజీజ్, సభ్యులు నరేష్, టీడీపీ నాయకులు రాకేష్‌చౌదరి, బండి కాశీవిశ్వనాథ్, శివ పాల్గొన్నారు.

ఫ్యాక్టరీ నిర్మాణం ఆపాలని ధర్నా



రాస్తారోకో చేస్తున్న రేకలకుంట గ్రామస్థులు

బుక్కరాయసముద్రం, జూన్ 28: మండలంలోని రేకలకుంట గ్రామంలో తలపెట్టిన నిర్మాణ పనులను ఆపాలని ఆ గ్రామస్థులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. అందులో భాగంగా రేకలకుంట రోడ్డుపై రెండు గంటల పాటు బైఠాయించి.. రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా ఆ గ్రామస్థులు మాట్లాడుతూ.. గ్రామంలో నాలుగు సంవత్సరాలుగా అనుమతులు లేకుండా ఫ్యాక్టరీని నిర్మిస్తున్నారన్నారు. తాము ఆందోళన చేసిన సమయంలో తాత్కాలికంగా పనులు ఆపేసి... కొన్ని రోజులకు మళ్లీ పనులు ప్రారంభిస్తున్నారన్నారు. రోజుకు ఒక కంపెనీ పేరుతో మోసం చేస్తున్నారని ఆరోపించారు. గ్రామంలో ఈ ఫ్యాక్టరీని నిర్మిస్తే తాగు, సాగు నీరు, వాతావరణం కలుషితం అయ్యే ప్రమాదముని ఆరోపించారు. ఆ ఫ్యాక్టరీకి విద్యుత్ సరఫరాను తొలగించాలన్నారు. కార్యక్రమంలో గ్రామస్థులు సాకే రామక్రిష్ణ, మాజీ సర్పంచ్‌లు నారాయణస్వామి, ఆదిశేషు, రమణమూర్తి, వెంకటనారాయణ, మల్లిఖార్జున, సాయి వెంకటపతి, రవి, బాలయాదవ్, తిరుపతయ్య, రాజు పాల్గొన్నారు.

ఆస్పత్రి వద్ద అన్నదానం

అనంతపురం కల్చరల్, జూన్ 28: నిత్యసురభి చారిటబుల్ ట్రస్టు చైర్‌పర్సన్ నిర్మలా మురళి ప్రభుత్వ సర్వజనాస్పత్రి ఎదుట దాదాపు 300 మందికి శుక్రవారం అన్నదానం చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు కవీన్ ఆదిత్య, సుబ్రహ్మణ్యం, ఓబులపతి, కిష్టప్ప, చంద్రశేఖర్, జగన్నాథ్, రవికుమార్, మణిదీప్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

సునామ జకినీమాత
ఆలయ అధ్యక్షుడిగా లక్ష్మణ్‌రావు


ప్రమాణ స్వీకారోత్సవ సభలో మాట్లాడుతున్న లక్ష్మణ్‌రావు

గుత్తి, జూన్ 28: పట్టణంలోని సునామ జకినీ మాత ఆలయ నూతన అధ్యక్షుడిగా అనంతపురానికి చెందిన మల్కారి ఆలూరు లక్ష్మణ్‌రావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక ఆలయంలో శుక్రవారం ఆలయ నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడిగా లక్ష్మణ్‌రావు, ప్రధాన కార్యదర్శిగా భాస్కర్‌రావు, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా సాయినాథ్, కోశాధికారి సుధాకర్‌రావు, మహిళా అధ్యక్షురాలిగా సరస్వతీబాయి, ఆలయ ధర్మకర్తగా సురేష్‌రావు ప్రమాణ స్వీకారం చేశారు. గౌరవ అధ్యక్షులు రమణరావు, శివాజీరావు, రాజేష్‌ఖన్నా, అభిలాష్, మాధవరావు పాల్గొన్నారు.

మొక్కలు నాటితేనే భావితరాల మనుగడ


బొమ్మనహాళ్‌లోని కళాశాలలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు, లెక్చరర్లు

బొమ్మనహాళ్, జూన్ 28: ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడితేనే భావితరాలకు మనుగడ ఉంటుందని ప్రిన్సిపాల్ మోహన్‌కుమార్ తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. శుక్రవారం కళాశాల ప్రిన్సిపాల్ మోహన్‌కుమార్‌తో కలిసి విద్యార్థులు మొక్కలు నాటి నీరు పోశారు. 150 మొక్కలు నాటారు. లెక్చరర్లు హనుమంతనాయక్, సుబ్బరాయుడు, ఆదిరాముడు, శంకర్‌లింగ, వరలక్ష్మి, స్వప్న, గంగిరెడ్డి పాల్గొన్నారు.

కంబదూరు (కళ్యాణదుర్గం): ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచి పర్యావరణాన్ని కాపాడుదామని ఎంపీడీవో సాల్మన్‌రాజు, ఎస్ఐ ఆంజనేయులు పిలుపునిచ్చారు. శుక్రవారం కంబదూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొక్కల పెంపకానికి శ్రీకారం చుట్టారు. వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఇంటి ముందు ఒక మొక్కను పెంచితే వర్షాలు సమృద్ధిగా కురుస్తాయన్నారు. మొక్కల పెంపకంపై విద్యార్థులు గ్రామీణ ప్రాంత ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం వుందన్నారు. అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

ట్యాంకర్లతో నీటి సరఫరా
● మంత్రి ఆదేశాలతో స్పందించిన అధికారులు


ట్యాంకర్ల వద్ద నీటిని పట్టుకుంటున్న రైతులు

ఉరవకొండ, జూన్ 28: పట్టణంలో తాగునీటి ఎద్దడి నెలకొనడంతో ట్యాంకర్లతో నీటిని సరఫరా చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. తాగునీటి సమస్యను ఆర్థిక శాఖామంత్రి పయ్యావుకేశవ్ దృష్టికి వెళ్లడంతో జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి, ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పట్టణంలో శుక్రవారం 14 ట్రాక్టర్ల ద్వారా నీటిని సరఫరా చేపట్టారు. స్థానిక లాల్‌స్వామి గుడి, వెలిగొండ, మల్లేశ్వరస్వామి గుడి, 1వ వార్డులో ట్యాంకర్లతో నీటిని అందించారు.

దళితవాడలో తాగునీటి ఎద్దడి


ట్యాంకర్ వద్ద నీటిని పట్టుకుంటున్న ప్రజలు

పెద్దవడుగూరు, జూన్ 28: మండలంలోని లక్షుంపల్లి గ్రామ దళితవాడలో మూడురోజులుగా తాగునీటి ఎద్దడి నెలకొంది. గ్రామంలోని బావి మరమ్మతులకు గురి కావడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విషయాన్ని తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి దృష్టికి గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు సతీష్‌రెడ్డి, రామానుజన్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి తీసుకువెళ్లారు. ఆయన ఆదేశాలమేరకు ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేశారు.

విద్యాప్రమాణాలకు పెట్టింది పేరు
ఎస్ఎస్‌జీఎస్ డిగ్రీ కళాశాల
● కరస్పాండెంట్ కేసీ హరికుమార్


మాట్లాడుతున్న కరస్పాండెంట్ కేసీ హరికుమార్

గుంతకల్లుటౌన్, జూన్ 28: విద్యాప్రమాణాలకు పెట్టింది పేరు శంకరానందగిరి స్వామి డిగ్రీ కళాశాల అని కరస్పాండెంట్ కేసీ హరికుమార్ అన్నారు. స్థానిక కళాశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 1984లో ప్రారంభమైన కళాశాల దినదినాభివృద్ధి చెందుతూ ఎంతో మందికి ఉన్నత చదువులను అందించి, వేలాది మంది విద్యార్థుల భవితకు బాటలు వేసిందన్నారు. బీబీఏ, బీసీఏ కోర్సులు ఉన్న ఏకైక కళాశాలగా గుర్తింపు లభించిందన్నారు. ప్రిన్సిపాల్ గోపాల్, ఆధ్యాపకులు సురేష్‌కుమార్, బసెట్టి క్రిష్ణయ్య పాల్గొన్నారు.

అర్ధంతరంగా ఆగిన కేజీబీవీ ప్రహరీ నిర్మాణం
● ఇబ్బంది పడుతున్న విద్యార్థినులు

గుంతకల్లుటౌన్, జూన్ 28: పట్టణంలోని దోనిముక్కల రోడ్డులో ఉన్న కస్తూర్బా విద్యాలయ ప్రహరీ నిర్మాణం అర్ధంతరంగా ఆగిపోయింది. విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విద్యాలయం చుట్టూ ప్రహరీ నిర్మాణం చేపట్టారు. విద్యాలయం వెనుక బాత్‌రూంల వద్ద నిలిపివేశారు. ప్రహరీ వెనుక ఉన్న నీటి సంపుపై ఆకతాయిలు సాయంత్రం వేళలో కూర్చొని మద్యం సేవిస్తున్నారు. పది బాత్‌రూంలకు సిమెంట్ వెంటిలేటర్‌ను ఏర్పాటు చేశారు. గుర్తుతెలియని వ్యక్తులు ఒక వెంటిలేటర్‌కు ఉన్న రంధ్రాన్ని వెడల్పు చేశారు. దీంతో విద్యార్థినులు బాత్‌రూంలకు వెళ్లాలంటే భయపడుతున్నారు. ఈ విషయాన్ని విద్యార్థినులు వారి తల్లిదండ్రుల దృష్టికి తీసుకెళ్లారు. రెండురోజుల క్రితం విద్యాలయంలో తల్లిదండ్రుల సమావేశంలో తల్లిదండ్రులు ఇన్‌చార్జి ఎస్ఓ కాంచన దృష్టికి తీసుకువచ్చారు. ఎంఈఓ మస్తాన్‌రావు దృష్టికి తీసుకెళ్లినట్లు ఎస్ఓ తెలిపారు. విద్యాలయం చుట్టూ పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయని, వాటిని తొలగించాలని విద్యార్థినుల తల్లిదండ్రులు కోరుతున్నారు.


విద్యాలయం వెనుక నిలిచిన ప్రహరీ నిర్మాణం

హెచ్చెల్సీ ఆధునికీకరణ పనులు చేపడతాం
● యూటీ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే కాలవ


యూటీ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

బొమ్మనహాళ్, జూన్ 28: సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి హెచ్చెల్సీ ఆధునికీకరణ పనులు చేపడతామని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం మండలంలోని చెర్లోపల్లి 11ఏ/600 కి.మీ వద్దనున్న యూటీ పనులను డీఈ మద్దిలేటితో కలిసి ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో నీరు ప్రవాహం సమయంలో ఇబ్బందులు కలుగకుండా పనులు జరిపించాలని అధికారులకు సూచించారు. ఎలాంటి సమస్యలు తలెత్తకుండా సాగునీటిని ఆయకట్టుకు అందించాలన్నారు. అండర్ టన్నెల్‌లో నీరు వెళ్లేందుకు అవకాశం లేని విధంగా మొత్తం పూడిక పేరుకుపోయి వర్షపునీటి ప్రవాహం జరగని కారణంగానే స్లాబ్‌పైకి వచ్చిందని, వెంటనే మరమ్మతులు చేయకపోయి ఉంటే భవిష్యత్తులో పెద్ద ప్రమాదమే జరిగేదన్నారు. నీళ్లు వచ్చేలోపు పనులు జరుగుతాయని అన్నారు. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం కనీస మరమ్మతులు చేయని కారణంగానే జీప్‌ట్రాక్ దెబ్బతిందన్నారు. ఎక్కడ చూసినా ముళ్లపొదలు పెరిగిపోయి నడవడానికి ఇబ్బందికర పరిస్థితిలో ఎగువకాలువ జీప్‌ట్రాక్ ఉందన్నారు. కాలువ ఆధునికీకరణ ఆవశ్యకతను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళతామని తెలిపారు. కార్యక్రమంలో జేఈ అల్తాఫ్, టీడీపీ మండల కన్వీనర్ బలరాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో భాగస్వాములు కండి

రాయదుర్గం: కూటమికి అఖండ విజయాన్ని ఇచ్చిన ప్రజలకు సేవ చేసేందుకు రాయదుర్గం అభివృద్ధిలో బీజేపీ, జనసేన పార్టీలు భాగస్వామ్యం కావాలని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని సీతారామాంజనేయ కళ్యాణమండపంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ హీరోజీరావు అధ్యక్షతన ఎమ్మెల్యేకు అభినందనసభను ఏర్పాటు చేశారు. ఆయనకు శాలువ కప్పి మెమెంటోను అందించి సత్కరించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు వసుంధరాదేవి, అంబోజీరావు, సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.


ఎమ్మెల్యే కాలవను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

మంత్రి సవితను కలిసిన టీడీపీ నాయకులు


మంత్రికి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

పుట్లూరు, జూన్ 28: సత్యసాయి జిల్లా పెనుకొండలో శుక్రవారం బీసీ సంక్షేమశాఖ మంత్రి సవితను టీడీపీ మండల నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రిని శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో గోవర్ధన్‌రాజు, లింగమూర్తి, హర్షవర్ధన్‌చౌదరి, నాగార్జుననాయుడు ఉన్నారు.

విద్యతోనే భవిష్యత్తుకు పునాది: ఎంఈవో


తాడిపత్రిలో ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

కళ్యాణదుర్గంరూరల్, జూన్ 28: విద్యతోనే విద్యార్థులకు మంచి భవిష్యత్తు వుంటుందని ఎంఈవో విజయ్‌కుమారి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని చాపిరి గ్రామంలో నేను బడికి పోతా కార్యక్రమాన్ని పేరెంట్ కమిటీ ఛైర్మన్ ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎంఈవో మాట్లాడుతూ బడిమానేసిన విద్యార్థులను బడిలో చేర్పించాలని ప్రజలకు విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. గత సంవత్సరంలో బడి మానేసిన 4వ తరగతి విద్యార్థిని శిరీష, దివ్యాంగురాలు పూజితలను తల్లిదండ్రులకు విద్య ఆవశ్యకతను వివరించి తిరిగి పాఠశాలలో నమోదు చేయించామన్నారు.

తాడిపత్రిటౌన్: పట్టణంలోని నందలపాడు ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం నేను బడికిపోతా కార్యక్రమం నిర్వహించినట్లు ప్రధానోపాధ్యాయుడు రఘురామిరెడ్డి తెలిపారు. విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. పెద్దలు పనికి పిల్లలు బడికి, బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలని నినాదాలు చేశారు. బడిబయట ఉన్న పిల్లలను పాఠశాలలో చేర్చుకోవడమే కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని ఎంఈఓ నాగరాజు తెలిపారు. బడి బయట ఉన్న నలుగురు పిల్లలను చేర్చుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రామగోవింద్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఓడీఎఫ్‌పై గ్రామాల్లో సర్వే

యల్లనూరు, జూన్ 28: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఓడీఎఫ్‌పై సచివాలయ ఇంజనీర్లతో సర్వే చేస్తున్నట్లు ఎంపీడీఓ వీరరాజు తెలిపారు. ఇంటింటికి వెళ్లి బాత్రూం, మరుగుదొడ్డి సౌకర్యం ఉందా లేదా అనే విషయాలను పరిశీలించి అందులో నమోదు చేస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో బహిర్భూమికి వెళ్లకూడదన్న ఉద్దేశంతో సర్వే చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

సెలవులో సీఐ

తాడిపత్రిటౌన్, జూన్28: తాడిపత్రి పట్టణ సీఐ నాగేంద్రప్రసాద్ శుక్రవారం వ్యక్తిగత కారణాలతో సెలవులో వెళ్లారు. ఎన్నికల నేపథ్యంలో చోటు చేసుకున్న రాళ్లదాడుల్లో సస్పెండ్ అయిన సీఐ మురళీకృష్ణ స్థానంలో వచ్చిన నాగేంద్రప్రసాద్ నెలన్నరకే సెలవుపై వెళ్లడం గమనార్హం. రూరల్ సీఐ లక్ష్మికాంత్‌రెడ్డికి ఉన్నతాధికారులు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.

విద్యార్థులకు నగదు బహుమతులు


నగదు బహుమతులను అందజేస్తున్న పెన్షనర్ల సంఘం నాయకులు

తాడిపత్రి టౌన్, జూన్ 28: మండలంలోని సజ్జలదిన్నె గ్రామంలోని జడ్పీహైస్కూల్‌లో శుక్రవారం పదోతరగతి ఫలితాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు పెన్షనర్ల సంఘం తరపున నగదు బహుమతులు అందించినట్లు సంఘం అధ్యక్షుడు సత్యప్రసాద్‌రెడ్డి తెలిపారు. ప్రథమ బహుమతి రూ.5వేలు షకీలాబాను, ద్వితీయ బహుమతి ఇమాంసాహెబ్ రూ.3వేలు, తృతీయ బహుమతి బండారు సుమంత్‌కు రూ.2వేలు నగదు అందజేశారు. హెచ్ఎం లక్ష్మీనరసింహులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యాసామగ్రి వితరణ


హనిమిరెడ్డి పల్లిలో విద్యార్థులతో దాత ప్రమీళమ్మ

బెళుగుప్ప, జూన్ 28: మండలంలోని బ్రాహ్మణపల్లి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన కృష్ణస్వామి రూ.ఐదు వేలు విలువచేసే నోట్ పుస్తకాలు, సామగ్రి పంపిణీ చేశారు. హనిమిరెడ్డిపల్లి, కాలువపల్లి పాఠశాలలో అగస్ స్థాపకురాలు ప్రమీళమ్మ 5వ తరగతి వరకు విద్యార్థులు సామగ్రిని అందజేశారు. బ్రాహ్మణపల్లి ప్రధానోపాధ్యాయుడు లక్ష్మన్న, ఉపాధ్యాయులు వెంకటేశులు, టీడీపీ నాయకులు అంజి, మారెప్ప, కిష్టప్ప పాల్గొన్నారు.

మారని అధికారుల తీరు..



నవరత్నాల పేరుతో ఉన్న లోగో

పుట్లూరు, జూన్ 28: కూటమి అధికారంలోకి వచ్చినా అధికారుల తీరులో మాత్రం మార్పు కనిపించడం లేదు. మండలంలోని కందికాపుల రైతుభరోసా కేంద్రానికి నవరత్నాల పథకాల లోగోలో జగన్ ఫోటోను మాత్రం అలాగే ఉంచారు. వాటితోపాటు మాజీ ఎమ్మెల్యే పద్మావతి, మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఫొటోలు శిలాఫలకాల్లో దర్శనమిస్తున్నాయి. ఎన్నికల కోడ్ అనంతరం ముసుగులు తీసివేశారు. కానీ ప్రభుత్వం మారినా కూడా తీసివేయకపోవడం గమనార్హం.

ఉచిత గర్భకోశ పశువైద్యశిబిరం

బ్రహ్మసముద్రం, జూన్ 28: మండల పరిధిలోని కోనాపురం గ్రామంలో ఉచిత గర్భకోశ చికిత్స శిబిరం నిర్వహించారు. పశు వైద్యాధికారి డాక్టర్ నవీన్‌కుమార్ పశువులకు పరీక్షలు చేశారు. నట్టల నివారణ మందులు 50పశువులకు తాగించారు. ముద్ద చర్మ వ్యాధికి 215 వాటికి టీకాలు వేశారు. డాక్టర్ నవీన్ కుమార్, పశుసంవర్ధక శాఖ సహాయకులు ప్రియాంక, సర్పంచ్ వనిత, గ్రామ ప్రతినిధి మల్లికార్జున పాల్గొన్నారు.

ఇంటివద్దకే పింఛన్: కమిషనర్


తాడిపత్రిలో మాట్లాడుతున్న కమిషనర్ రామమోహన్

తాడిపత్రిటౌన్, జూన్28: ఎన్టీఆర్ భరోసా పింఛన్ పథకం కింద జూలై 1 పింఛన్ సొమ్ము ఇంటివద్దకే లబ్ధిదారులకు అందజేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ రామమోహన్ తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం సచివాలయ సిబ్బందికి పింఛన్ల పంపిణీపై శిక్షణ ఇచ్చారు. పంపిణీలో పాటించాల్సిన మెలకువలను వివరించారు.

యల్లనూరు: మండలంలో 1నుంచి ఇంటింటికి పింఛన్ల పంపిణీ కోసం 123మంది సిబ్బందిని నియమించినట్లు ఎంపీడీఓ వీరరాజు తెలిపారు. 21 గ్రామ పంచాయతీల్లో 6656మంది పింఛన్‌దారులు ఉన్నారు. వీరికి 1వ తేదీన పింఛన్లు పంపిణీ చేయడానికి అన్ని గ్రామ సచివాలయాల సిబ్బందితోపాటు, వ్యవసాయ మండల సర్వేయర్లను నియమించామన్నారు.

గుత్తి: ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు అన్నారు. స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో శుక్రవారం మున్సిపల్, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. సామాజిక భద్రతా పింఛన్లను జూలై1నుంచి పింఛనుదారులకు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.

బెళుగుప్ప: ఎన్టీఆర్ భరోసా పింఛన్లు ఉదయం 6 గంటల నుంచే లబ్ధిదారులకు పంపిణీ చేయాలని ఈవోఆర్డీ మాధవరెడ్డి సిబ్బందికి సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పింఛన్ల పంపిణీపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

పింఛన్ కోసం సచివాలయం వద్దకు వెళ్లకండి

రాయదుర్గం: లబ్ధిదారులు పింఛన్ కోసం సచివాలయాల వద్దకు వెళ్లవద్దని మున్సిపల్ కమిషనర్ కిశోర్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. లబ్ధిదారులందరికీ 1వ తేదీ నుంచి సచివాలయ సిబ్బంది ద్వారా ఇంటి వద్దకే పంపిణీ చేస్తామన్నారు.

పారిశుధ్యం మెరుగుకు చర్యలు: డీపీఓ


ఉరవకొండలో పారిశుధ్య పనులు పర్యవేక్షిస్తున్న డీపీఓ ప్రభాకరరావు

ఉరవకొండ, జూన్ 28: సీజనల్ వ్యాధుల ప్రబలుతున్న నేపథ్యంలో పారిశుధ్యం మెరుగునకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు డీపీవో ప్రభాకరరావు తెలిపారు. పట్టణంలోని రంగావీధిలో పారిశుధ్య పనులను ఆయన పరిశీలించారు. డ్రైనేజీలు శుభ్రం చేయించారు. కాలువల్లో స్ప్రే చేయించారు. మురుగు నీరు నిల్వ ఉన్నచోట బ్లీచింగ్ చల్లించారు. డయేరియా, మలేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా శానిటేషన్ చేపట్టాలని సూచించారు. మేజర్ పంచాయతీ కార్యదర్శి గౌస్, సచివాలయసిబ్బంది పాల్గొన్నారు.

యాడికి: పరిసరాల పరిశుభ్రతతోనే రోగాలు రాకుండా చేసుకోవచ్చునని మలేరియా నివారణ తాడిపత్రి సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం యాడికిలోని నారాయణస్వామి కాలనీలో నిల్వ ఉన్న మురుగునీటిలో దోమలు వృద్ధిచెందకుండా అబేట్‌ను చల్లారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇళ్లవద్ద మురుగునీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడేని పాటించాలని సూచించారు. పలువురు ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

బొమ్మనహాళ్: ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని మండలంలోని శ్రీధరఘట్ట వైద్యులు సూచించారు. శుక్రవారం సింగానహల్లి గ్రామంలో సీజనల్ వ్యాధులపై స్టాఫ్ డయేరియా, మలేరియా, డెంగీ జ్వరాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు నాగేష్‌రెడ్డి, యుగంధర్, హెల్త్ సూపర్‌వైజర్ ఉమాదేవి, ఆరోగ్య కార్యకర్తలు వెంకటరమణ, ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

కుందుర్పి: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా వుండాలని మలేరియా అధికారి తిరుపాలయ్య సూచించారు. మండల పరిధిలోని కదరంపల్లి గ్రామంలో శుక్రవారం వైద్య అధికారుల సమక్షంలో సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వైద్య అధికారులు అనూషదేవి, చాంద్ బేగం, వైద్యసిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


కుందుర్పిలో వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

కార్యకర్తలు అధైర్యపడొద్దు: ఎమ్మెల్యే అశ్మిత్‌రెడ్డి



తాడిపత్రిటౌన్, జూన్ 28: టీడీపీ కార్యకర్తలు ఎవరూ అధైర్యపడవద్దని ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి అన్నారు. అనంతపురంలోని నివాసంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. తాను అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన ఆనందం కంటే టీడీపీ కార్యకర్తలు జైలులో ఉండడం తనను ఎంతో బాధిస్తోందన్నారు. త్వరలోనే వారందరూ బయటకు వస్తారని తెలిపారు. ఎవరూ అధైర్యపడాల్సిన పనిలేదన్నారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారందరికి సముచిత స్థానం ఉంటుందని తెలిపారు. ఎన్నికల్లో చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీమేరకు జూలై నెలకు సంబంధించిన పింఛన్ సొమ్ము రూ.4వేలతోపాటు మూడునెలల బకాయి మొత్తం రూ.7వేలు అందజేయనున్నట్లు తెలిపారు.

19 నుంచి గురుపూర్ణిమ వేడుకలు

తాడిపత్రిటౌన్, జూన్ 28: పట్టణంలోని శివాలయంరోడ్డులో ఉన్న షిర్డి సాయిబాబా మందిరంలో జూలై 19 నుంచి 21వ తేదీ వరకు గురుపూర్ణిమ వేడుకలు జరగనున్నాయి. 19న అభిషేకం, మహాగణపతి, నవగ్రహ, రుద్ర, చండీహోమాలు, పవన, దత్త శ్రీసాయి హోమం, 20న కాశీ, రామేశ్వరం తదితర పుణ్యతీర్థాల నదుల నీటితో అభిషేకం, మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం సాయంత్రం విష్ణు సహస్రనామ పారాయణం, భజనలు, పల్లకిసేవ తదితర పూజా కార్యక్రమాలు జరగనున్నాయి. 21న కాకడ హారతి, మహాన్యాసపూర్వక ఏకాదశవార రుద్రాభిషేకం, మహామంగళహారతి నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

1న వీరభద్రస్వామి హుండీ ఆదాయం లెక్కింపు

విడపనకల్లు, జూన్ 28: మండలంలోని ఉండబండ వీరభద్రస్వామి ఆలయ హుండీ ఆదాయాన్ని 1వ తేదీన లెక్కించనున్నట్లు ఆలయ ఈఓ రమేష్ బాబు ఒక ప్రకటనలో శుక్రవారం తెలిపారు. పాల్తూరు పంచాయతీ పరిధిలోని వీరభద్రస్వామి ఆలయంలో భక్తులు స్వామివారికి సమర్పించిన కానుకలు, ముడుపులను లెక్కించి వచ్చిన నగదును బ్యాంక్‌లో జమ చేస్తామన్నారు.

కోమటికుంట్లలో పోలీసు పికెట్


గ్రామంలో బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

పుట్లూరు, జూన్ 28: మండలంలోని కోమటికుంట్ల గ్రామంలో టీడీపీ, వైసీపీ వర్గాల ఘర్షణ నేపథ్యంలో చికిత్స పొందుతూ వైసీపీ కార్యకర్త ఎరుకలయ్య మృతిచెందడంతో గ్రామంలో పోలీస్ పికెట్ ఏర్పాటుచేశారు. 60మంది సిబ్బంది, ఇద్దరు డీఎస్పీలు, నలుగురు సీఐలతో గ్రామంలో బందోబస్తు ఏర్పాటుచేశారు. శుక్రవారం సాయంత్రం ఎరుకలయ్య మృతదేహానికి అంత్యక్రియలు చేయడంతో ఎలాంటి ఘటనలు జరగకుండా ముందస్తుగా పర్యవేక్షించారు. డీఎస్పీలు వెంకటశివారెడ్డి, శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రస్తుతం గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పికెట్ ఏర్పాటు చేశామన్నారు. ఎరుకలయ్య మృతదేహానికి వైసీపీ నాయకులు ఆలూరు సాంబశివారెడ్డి తదితరులు నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

పొలంలోకి రానివ్వకుండా అడ్డుకుంటున్నారు
● వైసీపీ నాయకుడిపై రైతు ఫిర్యాదు


న్యాయం చేయాలని కోరుతున్న రైతు కిష్టప్ప

బెళుగుప్ప, జూన్ 28: పొలంలోకి వెళ్లకుండా తనను దౌర్జన్యంగా అడ్డుకుంటున్నారని మండలంలోని కాలువపల్లికి చెందిన వైసీపీ నాయకుడు ఈడిగ సుధాకర్‌పై బాధిత రైతు కిష్టప్ప శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రైతు మాట్లాడుతూ స్వగ్రామం కాలువపల్లిలో బతుకుతెరువు కోసం తాడిపత్రి దగ్గర చిన్నవడగూరుకు వెళ్లి అక్కడే స్థిరపడి జీవనం సాగిస్తున్నట్లు తెలిపాడు. నాకు 13-1 సర్వే నెంబర్‌లో 5.50 ఎకరాల పొలం ఉందన్నారు. పొలానికి పట్టాదారు పాసుపుస్తకంతో పాటు రిజిస్టర్ పత్రాలు ఉన్నాయన్నారు. బంధువు కావడంతో నాలుగేళ్ల క్రితం సుధాకర్‌కు కౌలుకు ఇచ్చానన్నాడు. సక్రమంగా కౌలు చెల్లించకపోవడంతో తానే సాగు చేసుకుంటున్నాని, కొద్ది రోజుల క్రితం పొలంలోకి వెళుతుండగా నీకేముంది ఈ పొలం నాదే, వస్తే నీ అంతుచూస్తానని బెదిరిస్తున్నాడని ఫిర్యాదు చేశారు. సమస్యపై 24వ తేదీ జిల్లా ఎస్పీ దృష్టికి తీసుకెళ్లానని, దౌర్జన్యం చేస్తున్న సుధాకర్‌పై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని కోరారు.

భూ కబ్జాదారుడిపై చర్యలు తీసుకోవాలి

గుంతకల్లు, జూన్ 28: పట్టణంలోని బళ్లారి రోడ్డు హనుమాన్ సర్కిల్‌లో అత్యంత విలువైన భూమిని వైసీపీ నాయకుడు ఆక్రమించాడని, విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు మాజీ కౌన్సిలర్ రామచంద్ర శుక్రవారం ఫిర్యాదు పంపారు. వైసీపీ నాయకుడు జీ దేవేంద్రప్ప హనుమాన్ సర్కిల్‌లోని సర్వే నెం.414, 424లలో గరుసు గుంతగా ప్రభుత్వ రికార్డుల్లో ఉండేదన్నారు. సర్వే నెం.424-ఏ1లో 1.44 ఎకరాల భూమిలో 44 సెంట్ల భూమిని దేవేంద్రప్ప పేరిట రికార్డుల్లో ఎక్కించారని తెలియజేశారు. రెండేళ్ల కిందట 424బీ సర్వే నంబరులోని 14 సెంట్లు, 412-2 సర్వే నంబరులో 2 సెంట్ల ప్రభుత్వ భూమిని అప్పటి రెవెన్యూ అధికారులు దేవేంద్రప్పకు కట్టబెట్టారని ఆరోపించారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కార్యాయానికి, రెవెన్యూ, మున్సిపల్ మంత్రిత్వ శాఖలకు ఫిర్యాదు కాపీలను పంపారు.

యువతి ఆత్మహత్య

గుంతకల్లు టౌన్, జూన్ 28: మండలంలోని దంచెర్ల గ్రామానికి చెందిన శిరీష(20)అనే యువతి కడుపునొప్పి భరించలేక ఆత్మహత్య చేసుకున్నట్లు రూరల్ పోలీసులు శుక్రవారం తెలిపారు. బాలసుంకన్న కుమార్తె శిరీష రెండేళ్ల నుంచి కడుపు నొప్పితో బాధపడుతోందన్నారు. అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో శిరీషకు వైద్యం చేయించారన్నారు. గురువారం రాత్రి కడుపునొప్పి అధికం కావడంతో భరించలేక ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిందన్నారు. సమాచారం అందుకున్న రూరల్ పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతురాలి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు.

వ్యవసాయ పరికరాలు చోరీ

బెళుగుప్ప, జూన్ 28: మండలంలోని కాలవపల్లికి చెందిన రైతు అశోక్ వ్యవసాయ తోటలో పరికరాలు గుర్తుతెలియని వ్యక్తులు రెండు రోజుల క్రితం ఎత్తుకెళ్లినట్లు బాధిత రైతు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఐదు ఎకరాలలో పంటల సాగుకు అమర్చిన స్ప్రింక్లర్లు, పైపులు, డ్రిప్ పరికరాలు ఎత్తుకెళ్లారన్నారు. రూ.40 వేలకు పైగా నష్టం వాటిల్లిందని రైతు వాపోయాడు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

కూడేరు, జూన్ 28: మండలంలోని ఉదిరిపికొండ గ్రామ సమీపంలో బోయ అనిల్ అనేవ్యక్తి ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకొని ఆత్మహత్యకు యత్నించాడు. స్థానికులు అందించిన వివరాల మేరకు బోయ అనిల్ ఉరవకొండ మండలం మోపిడి గ్రామం కాగా గత కొంత కాలంగా గ్రామంలో లేడని స్థానికులు తెలిపారు. శుక్రవారం స్వగ్రామమైన మోపిడికిలో జరిగిన శుభ కార్యక్రమానికి వెళ్లిన ఆయన తిరిగి ద్విచక్ర వాహనంలో వస్తూ ఉదిరిపికొండ గ్రామం దాటిన తర్వాత పెట్రోల్ ఒంటిపై పోసుకొని నిప్పంటించుకున్నాడు. సమీపంలోని తోటలోనున్న రైతులు వెళ్లి మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. తీవ్ర గాయాలైన అనిల్‌ను వెంటనే 108 వాహనంలో అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇటీవల అనిల్ తండ్రి మృతి చెందాడు. దీనికి తోడు కుటుంబ సమస్యలు కూడా ఉన్నట్లు తెలుస్తోంది.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

పెద్దవడుగూరు, జూన్ 28: మండలంలోని కాశేపల్లి టోల్‌ప్లాజా వద్ద ఉన్న పెట్రోల్ బంక్ సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డుప్రమాదంలో కుందుర్పి మండలం ఎనమలదొడ్డి గ్రామానికి చెందిన రమేష్ గాయపడినట్లు పోలీసులు తెలిపారు. రమేష్ వ్యక్తిగత పనినిమిత్తం ఆటోలో గుత్తికి వెళ్లి తిరుగు ప్రయాణంలో వస్తుండగా కాశేపల్లి వద్ద నిలిచిఉన్న ట్యాంకర్‌ను ఢీకొట్టాడు. దీంతోపాటు వెనుకల వస్తున్న కారు ఆటోను ఢీకొనడంతో గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.